శుక్రవారం 20 నవంబరు 2026 https://www.telugudesam.org



మూడో విడత పంచాయతీ పోరు

నోటిఫికేషన్ విడుదల చేసిన ఎస్ఈసీ

డిసెంబరు 2న పోలింగ్.. అదేరోజు కౌంటింగ్

- వివరాలు 3 లో..



మూడు ప్రాంతాల ఆర్థిక ప్రణాళికలే
రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్

- ప్రాజెక్టుల పురోగతిని తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలి
- పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావాలి
- భారీ ప్రాజెక్టులకు ఎంఎస్ఎంఈల అనుసంధానం
- ప్రతి పారిశ్రామిక క్లస్టర్‌కూ ఎకోసిస్టమ్ అభివృద్ధి
- పారిశ్రామిక అవసరాలకు ల్యాండ్ బ్యాంక్
- సైబరాబాద్ తరహాలో వైజాగ్ బే-టెక్ సిటీ
- సూర్యలంక, గండికోటలకు టూరిజం మాస్టర్ ప్లాన్
- తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోని 16 పట్టణాలు పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలి
- అమరావతి అభివృద్ధికి కేంద్రంగా ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు
- ఎకనామిక్ రీజియన్లపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

2

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల ప్రణాళికలు అభివృద్ధికి బ్లూ ప్రింట్ వంటివని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలపై అధికారులు రూపొందించిన ప్రణాళికలపై సీఎం సమీక్ష నిర్వహించారు. మూడు రీజియన్లలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశాఖ రీజియనల్ ప్రణాళికలో భాగంగా యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి విశాఖ బే-టెక్ సిటీ అని పేరు పెట్టారు. తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అమరావతి ఎకనమిక్ రీజియన్‌కు మచిలీపట్నం, రామాయపట్నం వంటి పోర్టులకు మంచి కనెక్టివిటీ అందిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

600 మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పూర్తి

- నేడు పెండింగ్ మండలాలకు ప్రక్రియ
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వెల్లడి



విజయవాడ(చైతన్యరథం): ఏపీలో 659 మండల పరిషత్‌లకు గాను 600 చోట్ల ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తెలిపింది. 59 మండల ప్రజాపరిషత్‌లలో పెండింగ్ ఉన్నట్లు పేర్కొంది. పెండింగ్ స్థానాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు జరుగుతాయని వివరించింది. మన్యం, విశాఖ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చి మగోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పూర్తయ్యాయని వివరించింది. కాగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహించిన చోట ఎంపికై న వారు ప్రమాణ స్వీకారం చేశారు. పదవీ కాలం కూడా గురువారం నుంచే ప్రారంభం అయింది.



పంచాయతీ నామినేషన్లలో వైసీపీ హింసాకాండ

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు టీడీపీ ఫిర్యాదు
- నాలుగు జిల్లాల్లో ఘటనలపై ఆధారాలు
- రౌడీ మూకలపై చర్యలు తీసుకోవాలని వినతి

4

రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ అరాచకాలపై తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేసింది. పల్నాడు, కడప, మార్కాపురం, ప్రకాశం జిల్లా జిల్లాల్లో జరిగిన ఘటనలకు సంబంధించి వీడియో ఆధారాలను అందజేశారు.



జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారు

జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక శుక్రవారం జరగనున్న దృష్ట్యా టీడీపీ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. మొత్తం 27 జిల్లాలలో టీడీపీకి 22 జెడ్పీ చైర్మన్, 20 వైస్ చైర్మన్ పదవులు ఫైనల్ చేసింది. జనసేనకి 4 జెడ్పీ చైర్మన్, 5 వైస్ చైర్మన్ పదవులు, బీజేపీకి 1 జెడ్పీ చైర్మన్, 2 వైస్ చైర్మన్ పదవులు కేటాయించారు.

టీడీపీ జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులు

క్ర.సం	జిల్లా పరిషత్	ఛైర్మన్	వైస్ ఛైర్మన్
1	విజయనగరం	జనసేన	గుంటు విజయ్ కుమార్
2	శ్రీకాకుళం	మజ్జి సిరి సహస్ర	పసల నీరజ
3	పార్వతీపురం మన్యం	జనసేన	వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్
4	విశాఖపట్నం	గాడు అలివేణి	సుకవాసి అజయ్ ఎ.ఎన్.
5	అనకాపల్లి	జనసేన	పెంటకోట స్వాతి
6	పోలవరం	వంతల రాజేశ్వరి	తీగల ప్రభ
7	కాకినాడ	జనసేన	పిల్లి అనంతలక్ష్మి
8	తూర్పు గోదావరి	కాడ పద్మ	జనసేన
9	డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ	గొల్లపల్లి అమూల్య	జనసేన
10	పశ్చిమ గోదావరి	ఇందుకూరి రామకృష్ణంరాజు	సిరగాని నాగేశ్వరరావు
11	ఏలూరు	చింతమనేని సాయి నవ్యశ్రీ	బొర్రా చలమయ్య
12	కృష్ణా	బీజేపీ	దండమూరి పూజిత
13	ఎన్టీఆర్	కోట పుల్లమ్మ	బీజేపీ
14	గుంటూరు	ధార అరుణ	తల్లా అశోక్ కుమార్
15	పల్నాడు	పుచ్చకాయల రమాదేవి	నల్లపాటి కీర్తన
16	బాపట్ల	పుషడపు రోహిణి	జనసేన
17	ప్రకాశం	కొక్కిలిగడ్డ ప్రభాకరరావు	జనసేన
18	మార్కాపురం	కందుల రామిరెడ్డి	జి.వి. శ్రీనివాస వర్మ
19	శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు	పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి	పొట్టెల్ల ప్రసాద్
20	కర్నూలు	చూడి ఉలిగయ్య	షేక్ షాదిక
21	నంద్యాల	షేక్ బ్రుహానుద్దీన్	కె. శ్రీకాంత్ రెడ్డి
22	అనంతపురం	గంజే నాగరాజు	వెన్నపూస లలిత
23	శ్రీ సత్యసాయి	పరిటాల శ్రీరామ్	జనసేన
24	వైఎస్ఆర్ కడప	పుత్తా నరసింహారెడ్డి	హబీబున్నీసా చాంద్ బాయి గారి
25	అన్నమయ్య	సుగవాసి ప్రసాద్ బాబు	తలారి శరణ్య
26	తిరుపతి	హేమలత	బీజేపీ
27	చిత్తూరు	మాదలం శైలజ	ఎస్. మంజుప్రియ వెంకటేష్


చైతన్యరథం



మూడు ప్రాంతాల ఆర్థిక ప్రణాళికలే

రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్

- ప్రాజెక్టుల పురోగతిని తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలి
- పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావాలి
- భారీ ప్రాజెక్టులకు ఎంఎస్ఎంఈల అనుసంధానం
- ప్రతి పారిశ్రామిక క్లస్టర్‌కూ ఎకోసిస్టమ్ అభివృద్ధి
- పారిశ్రామిక అవసరాలకు ల్యాండ్ బ్యాంక్
- సైబరాబాద్ తరహాలో వైజాగ్ బే-టెక్ సిటీ
- సూర్యలంక, గండికోటలకు టూరిజం మాస్టర్ ప్లాన్
- తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోని 16 పట్టణాలు పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలి
- అమరావతి అభివృద్ధికి కేంద్రంగా ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు
- ఎకనామిక్ రీజియన్లపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందిం చిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల ప్రణాళి కలు అభివృద్ధికి బ్లూ ప్రింట్ వంటివని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలపై అధికారులు రూపొందిం చిన ప్రణాళికలపై సీఎం సమీక్ష నిర్వహించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్ర సమగ్రాభి వృద్ధిపై సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ మూడు ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళికల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే గుర్తిం చి భర్తీ చేయాలని, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెట్టడం మాత్రమే అభివృద్ధి కాదని.. వాటి ద్వారా రాష్ట్ర ప్రజల ఆదాయా లు పెరగాలని, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని పేర్కొన్నా రు. ప్రజలకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి తలసరి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని... దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. ప్రతి ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, వనరులు, అవకాశాలను వినియో గించుకుంటూ రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను ఎప్పటి కప్పుడు సమీక్షించుకుంటూ అవసరమైన మేరకు మార్పులు చేయాలని సూచించారు. మూడు రీజియన్లలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికల అమల్లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కచ్చితంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రణాళికల అమల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే... ఆ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతి నిధుల సహకారం కూడా తీసుకుని ప్రభుత్వం యంత్రాంగం పని చేయాలని సూచించారు. అలాగే ఈ ప్రాజెక్టుల అమలుకు సంబం ధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంతో పాటు... వివిధ రూపాల్లో వారిని భాగస్వాములను చేయాలని నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద 60 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,180 కోట్లతో సిద్ధం చేసి ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేలా చూడా లని ఆదేశించారు.

యాంకర్ ప్రాజెక్టు ప్రాంతానికి విశాఖ బే-టెక్ సిటీ పేరు

విశాఖపట్నం ఎకనమిక్ రీజియనల్ ప్రణాళికలో భాగంగా యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి విశాఖ బే-టెక్ సిటీ అని పేరు పెట్టారు. వివిధ పేర్లను పరిశీలించిన అనంతరం సీఎం చంద్రబాబు విశాఖ బే-టెక్ సిటీ పేరును ఖరారు చేశారు. హైదరాబాద్ నగరంలో సైబరాబాద్ పేరుతో ఓ నగరాన్ని అభివృద్ధి చేసినట్టుగానే బే-టెక్ సిటీ పేరుతో విశాఖకు అను బంధంగా మరో నగరాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో నగర మేయర్‌కు చోటు కల్పించాలని సూచించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో వివిధ విభాగాలకు సంబంధించి 167 ప్రాజెక్టులకు గానూ... 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చాయని సీఎం వివరించారు. విశాఖకు చెరో వైపు ఉన్న విజయనగరం, అనకాపల్లి వైపు అభివృద్ధి జరుగు తోందని... ఆ ప్రాంతాల్లో అవసరమైన మేరకు ముందుగానే భూమిని గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సూచిం చారు. అలాగే తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూ లభ్యత తక్కువగా ఉంటుందని... దీనివల్ల పారిశ్రామికాభివృద్ధికి కొంత ఇబ్బంది ఉందన్నారు. ఈ మేరకు ఈ జిల్లాల్లో కూడా ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికోసం అవసరమైతే పాలసీ తీసుకురావాలని సూచించారు. విశాఖలో ఏడాదిలోగా కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని, తదు పరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అందులోనే నిర్వహిం చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోర్టుల ఆధారిత ఆర్థిక వ్యవస్థకు విస్తృత అవకాశాలున్నాయని, పరిశ్రమలకు అవసరమైన లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాల అనుసంధానాన్ని మెరుగు పరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పారిశ్రామిక ప్రాంతం వద్ద అవసరమైన నివాస, విద్య, వైద్యం, రవాణా సదుపాయాలతో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు.

గ్లోబల్ సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని సాంకేతిక, పారిశ్రామిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు అవస రమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్లు వంటి రంగాలకు అనుబంధంగా డిజైన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి పారిశ్రామిక క్లస్టర్లను మరింత బలోపేతం చేయాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాల్లో ప్రధాన పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అవసర మైన విడిభాగాలు, సేవలు అందించే ఎంఎస్ఎంఈలను కూడా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. కేవలం భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం కాకుండా, వాటి చుట్టూ స్థానికంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల నెట్‌వర్క్ ఏర్పడాలని చెప్పారు. ముఖ్యంగా పెద్ద పరిశ్రమలకు అనుసంధా నించేలా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి రంగానికి అవసరమైన పూర్తి ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమల వ్యర్థాల్లోని విలువైన పదార్థాలను తిరిగి వినియోగం లోకి తీసుకొచ్చే అవకాశాలను పరిశీలించాలని, అరుదైన ఖనిజాల వ్యర్థాల నుంచి ఇతర అవసరాలకు ఉపయోగపడే పదార్థాలను వేరు చేసే సాంకేతికతపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఖనిజ సంపద ఆధారంగా తిరుపతి ప్రాంతంలో కొత్త పెట్టుబడులకు అవకాశాలున్నాయని చెప్పారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో మొత్తంగా రూ.9 లక్షల కోట్ల పెట్టు బడులు వస్తే... అత్యధిక శాతం గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 5.70 లక్షల కోట్లు వచ్చాయని చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని.. దీన్ని మాగ్నటిక్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను కార్యాచరణలోకి తీసుకు రావాలని, మూడేళ్లలో లక్ష్యాలను సాధించేలా ప్రణాళిక రూపొం దించాలన్నారు. పెట్టుబడులు ఏయే రంగాల్లో, ఏయే ప్రాంతాల్లో వస్తున్నాయో స్పష్టంగా గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల అనుభవాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

అమరావతికి పోర్టుల కనెక్టివిటీతో వేగంగా అభివృద్ధి

అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో ఆక్వా, కోకో, పామాయిల్ వంటి రంగాలు అతి పెద్ద ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని తెలిపారు. అమరావతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఇప్పటికే రూ. 4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు నడుస్తున్నాయని తెలి పారు. మచిలీపట్నం, రామాయపట్నం వంటి పోర్టులకు మంచి కనెక్టివిటీ అందిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే క్వాంటం రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి రీజియన్ పరిధిలో పెద్దఎత్తున పెట్టుబడులు రావడానికి ఆస్కారం ఏర్పడుతుందని తెలిపారు. క్వాంటం కారిడా ర్‌గా అమరావతి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. క్వాంటం వ్యాలీతో పాటు క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి అమరావ తి కేంద్రంగా మారుతుందని వివరించారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణాలు అభివృద్ధికి కేంద్రంగా ఉంటాయని పేర్కొన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించాలని సూచించా రు. తిరుపతి ప్రాంతానికి ఐఐటీ, అమరావతి ప్రాంతానికి బిట్స్ పిలానీ వంటి సంస్థలతో పాటు మూడు ప్రాంతాల్లోనూ ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య నిరంతర అవగాహన, చర్చలు జరగాలని చెప్పారు. ఐఐటీయన్లు, పాన్ ఐఐటీ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

తీర ప్రాంతం... బుద్ధిస్ట్ సర్క్యూట్లతో టూరిజం అభివృద్ధి

అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల ను ఆకర్షించేలా రహదారులు, వసతి, ఇతర మౌలిక సదుపాయా లు కల్పించాలని చెప్పారు. వచ్చే సీఐఐ సదస్సు నాటికి వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులను అరకు, లంబసింగి వంటి ప్రాంతా లకు తీసుకెళ్లాలని సూచించారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచుతూ బీచ్ రిసార్టులుగా అభివృద్ధి చేయాలని తెలిపారు. సూర్యలంక, ఓడరేపు, చినగంజాం, నిజాంపట్నం, డిండి వంటి ప్రాంతాల్లో బీచ్, ఎకో టూరిజానికి అవకాశం ఉందని తెలిపారు. పర్యాటక అభివృద్ధి పేరుతో కాలుష్యానికి తావుండకూ డదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉన్న అవకాశాల ను పూర్తిగా వినియోగించుకోవాలని, శ్రీశైలం సహా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని చెప్పారు. నాగార్జునకొండ, అమరావతి ప్రాంతాలను అనుసంధానిస్తూ బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సూచించా రు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ప్రణాళికలు రచించి ఆ మేరకు ఆ ప్రాంతాన్ని నోటిఫై చేయాలని ఆదేశించారు. సూర్యలంక, గండికోట ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్లు రూపొందించాలని నిర్దేశించారు. ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని, పెట్టుబడుల గ్రౌండింగ్‌పై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వీకెండ్ ఎకాన మీపై దృష్టి పెట్టాలని... వాణిజ్య, పర్యాటక, వినోద కార్యకలాపా లను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్లకు సంబంధించిన సీఈవోలు యువరాజ్, ముఖేష్‌కుమార్ మీనా, సురేష్‌కుమార్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

వైద్యవిద్యలో ఆడపిల్లలే ముందంజ

మొత్తం సీట్లలో 61.34 శాతం ప్రవేశాలు - ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు అభినందనలు



అమరావతి(చైతన్యరథం): ఏపీలో వైద్య విద్యలో ఆడబిడ్డలు ఎక్కువ సీట్లు దక్కించుకోవడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్యా రంగంలో ఆడపిల్లలు ముందుండటం గర్వకారణమన్నారు. రాష్ట్ర కోటా కింద కేటాయించిన మొత్తం ఎంబీబీఎస్ సీట్లలో 61.34 శాతం సాధించి, 38.66 శాతం వాటా కలిగిన పురుష విద్యార్థుల ను అధిగమించిన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. ఇది వారి ప్రతిభ, పట్టుదల, పెరుగుతున్న ఆకాంక్షలకు నిదర్శనమ న్నారు. రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ కలలు కనడానికి... సాధించ డానికి, నాయకత్వం వహించేందుకు సమాన అవకాశాలు కల్పిం చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

ఎంబీబీఎస్ సీట్లలో ప్రవేశాల వివరాలు

2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఏపీలో రాష్ట్ర కోటా ఎంబీబీఎస్ సీట్లలో 61.34 శాతం సీట్లను విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. రాష్ట్ర కోటా కింద ఉన్న మొత్తం 6,937 ఎంబీబీఎస్ సీట్లలో 6,929 సీట్లు భర్తీ కావడంతో 99.88 శాతం అడ్మిషన్లతో ప్రవేశాల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. మొత్తం రాష్ట్ర కోటా సీట్లలో అమ్మాయిలు 4,250 సీట్లు (61.34%) సాధించగా, అబ్బాయిలు 2,679 సీట్లు (38.66%) పొందారు. కన్వీనర్ కోటాలోని మొత్తం 4,581 సీట్లు (ప్రభుత్వ కళాశాలల్లో 2,631, ప్రైవేట్ కళాశాలల్లో 1,950) పూర్తిగా భర్తీ అవగా.. ఇందులో 62.39 శాతం సీట్లను విద్యార్థినులే దక్కించుకున్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో 2,356 సీట్లకు గానూ 2,348 సీట్లు భర్తీ కాగా, ఇందులోనూ 59.28 శాతంతో అమ్మాయిలదే పైచేయిగా నిలిచింది.

ఏపీలోని మొత్తం 7,465 ఎంబీబీఎస్ సీట్లలో 528 సీట్లను ఆల్ ఇండియా కోటాకు కేటాయించారు. ఎన్ఎంసీ అనుమతితో నిర్వహించిన స్పెషల్ స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్‌లో మిగిలిన 69 ఎన్ఆర్ఐ కేటగిరీ సీట్లలో 61 భర్తీ కాగా, కేవలం 8 సీట్లు మాత్రమే ఖాళీగా మిగిలాయి. పాడేరు, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మిగిలిన సీట్లను సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లుగా మార్చడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కొత్తగా ఏర్పాటైన పిడుగురాళ్ల వైద్య కళాశాలలోని 22 కన్వీనర్ కోటా సీట్లు మూడో విడత కౌన్సెలింగ్ నాటికే పూర్తిగా నిండిపోయాయి. తుది అడ్మిషన్ల నివేదికను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సమర్పించింది.

జగన్ అక్రమాస్తుల కేసు.. స్టేటస్ రిపోర్టు సమర్పించండి


- **తెలంగాణ హైకోర్టు ఆదేశం**
- **తదిపరి విచారణ 30కి వాయిదా**



హైదరాబాద్/అమరావతి(చైతన్యరథం): వైసీపీ అధినేత వైఎస్ జగన్‌రెడ్డి కేసుల ప్రస్తుత పరిస్థితిపై స్టేటస్ రిపోర్టు సమర్పిం చాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి గురువారం హైకోర్టులో విచారణ జరి గింది. జగన్ కేసులపై స్టేటస్ రిపోర్టు సమర్పించాలని న్యాయ స్థానం ఆదేశించగా.. ఈ రిపోర్టు సమర్పించడానికి 3 వారాల గడువు కావాలని ప్రభుత్వం తరపున న్యాయవాదులు కోరారు. దీనిపై తెలంగాణ హైకోర్టు అంగీకారం తెలుపుతూ తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది. జగన్ అక్రమాస్తుల కేసులను త్వరగా తేల్చాలని ఈడీ, హరిరావజోగయ్య తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జగన్ అక్రమాస్తులపై ఇప్పటికే సీబీఐ, ఈడీ అభియోగపత్రాలను దాఖలు చేసింది. సీబీఐ 11, ఈడీ 9 అభియోగపత్రాలు దాఖలు చేయగా.. 15 ఏళ్లుగా విచారణ కొనసాగుతోందని ఈడీ తరఫున న్యాయవాది వాదించారు. పలు కేసుల్లో 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. డిశ్చార్జ్ పిటిషన్లపై సీబీఐ కోర్టులో విచారణ జరుగుతోందని కోర్టు దృష్టికి ఈడీ న్యాయవాది తీసుకెళ్లారు. డిశ్చార్జ్ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటంతో కేసుల విచారణ ప్రాథమిక దశలోనే నిలిచిపోయిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వాదనలు వినిపించింది. కేసులను రోజువారీ విచారణను చేపట్టా లని కోరింది. నిందితులు విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఈడీ కోరింది. కేసులను రోజు వారీగా విచారించాలని హరిరామ జోగయ్య తరపున న్యాయవాది కోరారు. 2024లోనే రోజువారీ విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పురోగతి లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రత్యేక కోర్టు ప్రిసైడింగ్ జడ్జిని ప్రతివాదిగా ఈడీ చేర్చడంపై హైకోర్టు ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కేసుల విచార ణలో జాప్యం జరిగిందనే కారణంతో న్యాయమూర్తులను ప్రతివా దులుగా చేర్చడం సరికాదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహకరించేందుకు అమికస్ క్యూరీని నియమించే అంశాన్ని ధర్మాసనం పరిశీలించింది. అమికస్ క్యూరీ నియామకం ద్వారా కేసులో న్యాయపరమైన అంశాలపై సహాయం తీసుకునే అవకాశం ఉంది. ఈ కేసులకు సంబంధించి తదుపరి విచారణను తెలంగాణ హైకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది.

మూడో విడత పంచాయతీ పోరు

నోటిఫికేషన్ విడుదల చేసిన ఎస్ఈసీ - డిసెంబరు 2న పోలింగ్..అదేరోజు కౌంటింగ్



విజయవాడ(చైతన్యరథం): రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్‌చంద్ర పునేఠా గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలోని 25 జిల్లాల పరిధిలోని ఎంపిక చేసిన మండలాల్లోని గ్రామ పంచాయతీలకు మూడో విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ విడతలో ఆయా గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు, సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ నెల 13న మొదటి విడత, 16న రెండో విడత నోటిఫికేషన్లు విడుదలై ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది.

ఎన్నికల షెడ్యూల్ వివరాలు

- నవంబరు 21న రిటర్నింగ్ అధికారులు ఫారమ్-1లో ఎన్నికల నోటీసు జారీ చేయడంతో పాటు వార్డు వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు.
- నవంబరు 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ(ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు)
- నవంబరు 24న నామినేషన్ల పరిశీలన (ఉదయం 8:00 గంటల నుంచి)
- నవంబరు 25న తిరస్కరణకు గురైన నామినేషన్లు సంబం ధిత ఆర్డీవో వద్ద అప్పీలు (సాయంత్రం 5:00 గంటల వరకు)
- నవంబరు 26న అప్పీలేట్ అధికారులు ఆయా అప్పీళ్లపై పరిష్కరిస్తారు
- నవంబరు 27న నామినేషన్ల ఉపసంహరణ (మధ్యాహ్నం 3:00 గంటల వరకు గడువు)
- నవంబరు 27న పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ (మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత)
- డిసెంబరు 2న పోలింగ్ (ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు)
- డిసెంబరు 2న పోలింగ్ ముగిసిన రోజునే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన (మధ్యాహ్నం 2:00 గంటల నుంచి)

ఫలితాల రోజే ఉపసర్పంచ్ ఎన్నిక

ఫలితాలు వెలువడిన రోజే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. ఒకవేళ ఆరోజు వీలుకాకపోతే సెలవు దినమైనా మరుసటి రోజు తప్పనిసరిగా ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే డిసెంబరు 3న ఉదయం 7:00 నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహిస్తారు.

నిబంధనలు/మూడో విడత జరిగే జిల్లాల వివరాలు

కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నా, పరిపాలనా, న్యాయపరమైన అడ్డంకులు ఉన్న ఆయా పంచాయతీలు లేదా పదవులకు ఎన్నికల నోటీసు జారీ చేయవద్దని కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. రీ పోలింగ్ జరిగిన పంచాయతీల్లో రీపోలింగ్ ఫలి తాల ప్రకటన తర్వాతే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని స్పష్టం చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ పట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లోని పలు మండలాల్లో మూడో విడత ఎన్నికలు జరగను న్నాయి. తూర్పు గోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్.టి.ఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ఎంపిక చేసిన మండలాల్లో పోలింగ్ జరగనుంది. మార్కాపురం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, వై.ఎస్.ఆర్.కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు మండలాలకు నోటిఫికేషన్ వర్తిస్తుంది.

చైతన్యరథం

పంచాయతీ ఎన్నికల్లో

వైసీపీ హింసాకాండ

- పలుచోట్ల ఆ పార్టీ శ్రేణుల బరితెగింపు
- నామినేషన్ వేయడానికి వెళ్లిన టీడీపీ నాయకులపై మహిళలతో కారం చల్లించి మారణాయుధాలతో దాడులు
- దొంగ ఓట్లు, రిగ్గింగ్ రాజకీయాలకు పులివెందుల ప్రజలు గుణపాఠం చెప్పారన్న ఎమ్మెల్సీ వర్ల రామయ్య
- లేళ్ల అప్పిరెడ్డికి పరామర్శ పేరుతో నిషేధాజ్ఞలు ఉల్లంఘించి జైల్లోకి దూసుకెళ్లిన సజ్జల, పెద్దిరెడ్డిలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయరా?
- కడప, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో వైసీపీ రౌడీ మూకల విధ్వంసం, అరాచకాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీకి వినతి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో వైఎస్సార్సీపీ శ్రేణులు పాల్పడుతున్న దాడులు, దౌర్జన్యాలు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీ బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్‌లతో కూడిన బృందం గురువారం కమిషనర్‌ను కలిసి సమగ్రమైన లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. పల్నాడు జిల్లా మునుగోడులో టీడీపీ నేతలపై వైఎస్సార్సీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారని, మహిళలు కారంపొడి చల్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కడప జిల్లా చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెలో టీడీపీ కార్యకర్తలకు చెందిన రెండు బైకులు, ఒక కారుకు నిప్పు పెట్టారని తెలిపారు. అలాగే తొండూరు మండలం ఆగూడూరు నామినేషన్ కేంద్రం వద్దే టీడీపీ శ్రేణులపై రాళ్లు, ఆయుధాలతో దాడి జరగడంతో ఏఎంసీ చైర్మన్ రామ సూరారెడ్డి పరిస్థితి విషమంగా మారిందని, మరో ముగ్గురికి తీవ్ర రక్తగాయాలయ్యాయని వివరించారు. మార్కాపురం జిల్లా పీసీపల్లె మండలం పెదఇర్లపాడు ఆర్వో (రిటర్నింగ్ అధికారి) కార్యాలయంలోకి కొందరు చొరబడి టీడీపీ నేత కొండారెడ్డి భూమిరెడ్డిపై దాడికి యత్నించారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం వెంకటాచలం సర్పంచ్ అభ్యర్థి చిన్న కోటయ్యపై దాడి జరగడంతో ఆయనకు తీవ్ర రక్తగాయాలయ్యాయని కమిషనర్‌కు వివరించారు. పల్నాడు, కడప, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరిగిన దాడులు, విధ్వంసాలకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను టీడీపీ బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు అందజేసింది. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని, ఈ ఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు.



పథకం ప్రకారం దాడులు

ఎస్ఈసీని కలిసిన అనంతరం ఎమ్మెల్సీ వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్లు వేయడానికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ నాయకులపై వైకాపా మూకలు పథకం ప్రకారం భౌతిక దాడులకు పాల్పడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నామినేషన్ వేసేందుకు వెళ్లిన తమ పార్టీ ముఖ్య నాయకుడిపై వైకాపా గూండాలు కక్షగట్టి దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను అడ్డుపెట్టుకుని, కొంగుల్లో కారం తెచ్చి తెదేపా కార్యకర్తల కళ్లలో చల్లారని, ఆపై రప్పా రప్పా బ్యాచ్ ఐరన్ రాడ్లు, కర్రలు, బండరాళ్లతో విచక్షణారహితంగా కొట్టారని వివరించారు. ఈ దాడిలో తమ నాయకుడి తలకు 16 కుట్లు పడ్డాయని, చనిపోయాడనుకుని వదిలివెళ్లగా ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను, ఆధారాలను కమిషనర్‌కు చూపించగా ఆయన కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. ఇంతటి ఘోరమైన దాడి జరిగితే పోలీసులు సాధారణ గాయాల కింద (325 ఐపిసి) కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని, తక్షణమే దీన్ని హత్యాయత్నం (పాత 307 ఐపిసి / కొత్త చట్టం 109 బిఎన్ఎస్) కేసుగా మార్చి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పెదకూరపాడు, కడప, పులివెందుల ప్రాంతాలు నేరాలకు అడ్డాగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా పులివెందులను తమ అడ్డాగా మార్చుకుని దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తో గెలుస్తూ వచ్చిన వైఎస్ కుటుంబానికి అక్కడి ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని వర్ల రామయ్య అన్నారు.

ప్రజల్లో చైతన్యం, ధైర్యం రావడంతో ప్రశాంత వాతావరణంలో పట్టణ స్థానిక ఎన్నికలు జరిగాయని, ఫలితంగా వైకాపా ఘోర పరాజయం పాలైందని పేర్కొన్నారు. అధికారం కోల్పోయి, పరువు పోవడంతో జగన్ మోహన్ రెడ్డి మయసభ నుంచి బయటకు వచ్చిన దుర్యోధనుడిలా నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని విమర్శించారు. పులివెందులలో వైకాపా అరాచక దుకాణం బంద్ అయిందని, ఇకపై ప్రజలను భయపెట్టడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఎక్కడ నామినేషన్లు ఆపారో, ఎప్పుడు ఆపారో ఆధారాలు చూపాలని సవాల్ విసిరితే జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పకుండా పారిపోతున్నారని, తిరిగి ఎన్నికల కమిషన్ వద్దకు వచ్చి దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని వర్ల రామయ్య మండిపడ్డారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబు నాయుడు నాయకత్వానికి గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఇప్పటికైనా వైకాపా నేతలు ప్రజాతీర్పును గౌరవించాలని హితవు పలికారు. గుంటూరు జిల్లాలో ఇటీవల జైల్లో ఉన్న రౌడీ షీటర్ లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించేందుకు వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వందలాది మంది కార్యకర్తలతో వెళ్లి నిషేధాజ్ఞలను ఉల్లంఘించారని వర్ల రామయ్య గుర్తు చేశారు. జైలు సిబ్బందిని నెట్టుకుంటూ లోపలికి దూసుకెళ్లిన ఘటనలో ఒక పోలీసు అధికారి కాలికి గాయమైందని, అయినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా చట్టం తన పని తాను చేసుకుపోవాలని, అరాచకాలకు పాల్పడేది ఏ పార్టీ వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు, ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.




కూటమి ప్రభుత్వంలో

గ్రామీణ రోడ్లకు మహర్దశ

గ్రామీణ రోడ్లు... గుంతల నుంచి అభివృద్ధి బాట వైపు



గ్రామీణ అభివృద్ధి అనేది కేవలం భౌతిక మౌలిక సదుపాయాల నిర్మాణం మాత్రమే కాదు. అది ప్రజల జీవన ప్రమాణాలను, ఆర్థిక కార్యకలాపాలను, ప్రాథమిక సేవల లభ్యతను నేరుగా ప్రభావితం చేసే కీలక అంశం. అలాంటిది గత వైసీపీ పాలనలో ఈ రోడ్లు గుంతలమయం కావడం కేవలం నిర్లక్ష్యం కాదు... అభివృద్ధి ప్రాధాన్యతల్లోని వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ' కార్యక్రమాల ద్వారా గ్రామీణ రోడ్లు గుంతల నుంచి అభివృద్ధి బాటవైపు పయనిస్తున్నాయి. గ్రామీణ రోడ్ల నాణ్యత అనేది కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు. అది వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ లింకేజీ, వైద్య సేవల సమయానుసార లభ్యత, విద్యా సంస్థలకు విద్యార్థుల ప్రవేశం వంటి అనేక అంశాలను నిర్ణయిస్తుంది. గత వైసీపీ హయాంలో రూ.9వేల కోట్లు పంచాయతీ నిధులను దారి మళ్లించి గ్రామీణ రోడ్లను గుంతలమయం చేసి గ్రామీణ ప్రజలకు నరకం చూపించారు.. వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం 884 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే నిర్మించి గ్రామీణ ప్రగతిపై గొడ్డలి వేటు వేశారు.



ఫలితంగా రైతులు ఉత్పత్తులను సమయానికి అమ్ముకోలేకపోవడం, అంబులెన్స్ సేవలు ఆలస్యం కావడం, విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులు వంటి సమస్యలు తీవ్రమయ్యాయి.

ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ పరిస్థితిని మార్చే దిశగా పల్లె పండుగ-1, 2, 3 కార్యక్రమాల కింద రూ.31,685 కోట్లతో 12,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 19,100 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించారు. 'అడవి తల్లి బాట-1,2' ద్వారా రూ.3,083 కోట్లతో 3,215 కి.మీ లక్ష్యంతో ఇప్పటికే 1974 కి.మీ. రోడ్లు వేసి డోలీ రహిత ఆంధ్రప్రదేశ్‌గా కూటమి ప్రభుత్వం కృషి చేసింది. గ్రామాల్లో మురుగునీటి సమస్య శాశ్వత నివారణకు పల్లె పండుగ 2.0, పల్లె పండుగ 3.0 ద్వారా రూ.110 కోట్లతో 1000 కి.మీ. మేర మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టింది. అంటే వైసీపీ పాలనలో వేసిన మొత్తం రోడ్ల కంటే 97శాతం రోడ్లు అదనంగా నిర్మించి గ్రామీణ ప్రగతికి బాటలు వేశారు. గ్రామాల్లోని ప్రధాన రోడ్లతో గ్రామీణ రవాణా నెట్‌వర్క్ బలపడుతోంది. 2014-19 అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ హయాంలో రూ.6,194 కోట్లతో 27వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, రూ.2,658 కోట్లతో 22,283 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించబడ్డాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే దృష్టిని కొనసాగిస్తూ 'పల్లె పండుగ' ద్వారా రోడ్లతో పాటు ఇతర అభివృద్ధి అంశాలను అనుసంధానం చేస్తోంది. ఈ పంచాయతీ ఎన్నికలు... విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న పోరాటం. మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికే 95శాతం స్ట్రైక్ రేటుతో ఓటు వేశారు. అదే తరహాలో పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజలు అభివృద్ధికే జై కొట్టడానికి సిద్ధంగా ఉన్నారు.

- టీడీపీ నాలెడ్జ్ సెంటర్

పాలకొల్లులో వైసీపీకి షాక్...

- టీడీపీలో చేరిన కౌన్సిలర్ అభ్యర్థి
- 38వ వార్డు టీడీపీకి ఏకగ్రీవం

పాలకొల్లు (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమగోదావరిజిల్లా పాలకొల్లులో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీ తరఫున కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేసిన కావల చంద్రావతి చివరి రోజున నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో వైసీపీకి ఆవార్డులో అభ్యర్థి లేకపోవడంతో టీడీపీ అభ్యర్థిగానామినేషన్ దాఖలుచేసిన బుద్ధరాజు విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ బోణీ కొట్టింది. యడ్ల బజారు శ్రీ కనకదుర్గమ్మ ఆలయ మాజీ చైర్మన్ కావల శ్రీనివాస రావు, ఆయన సతీమణి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రావతి దంపతులు వైసీపీకి రాజీనామా చేసి గురువారం టీడీపీలో చేరగా వీరికి మంత్రి నిమ్మల రామానాయుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి అభినందించారు. కాగాకూటమి ప్రభుత్వంలో మంత్రి నిమ్మల రామానాయుడు కోట్లాది రూపాయలు నిధులు తీసుకువచ్చి పాలకొల్లు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులుచేపడుతున్నారని ఇటువంటి అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే ఆయననాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో టీడీపీలో చేరుతున్నట్లు శ్రీనివాస రావు తెలిపారు. ఎప్పటినుంచో టీడీపీలో చేరాలని అనుకుంటున్నా ప్రస్తుత సమయంలో అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నాయకులు పెచ్చెట్టి బాబు,నాడిన ప్రతాప్,తదితరులు పాల్గొన్నారు.



జగన్ పాలనలో గ్రామాలు విధ్వంసం..

కూటమి పాలనలో అభివృద్ధి వికాసం

- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 9 వేల కోట్లు దారి మళ్లించిన గత ప్రభుత్వం
- ఉపాధి హామీ పథకంలో రూ.1,300 కోట్ల మేర దోపిడీ
- కూటమి ప్రభుత్వంలో పల్లెలకు స్వర్ణయుగం
- 'పల్లె పండుగ' ద్వారా రెండేళ్లలోనే గ్రామాల అభివృద్ధి కోసం రూ.32వేల కోట్లు ఖర్చు
- టీడీపీ నేత ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ

అమరావతి (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, పల్లె ప్రగతిపై ఆ పార్టీ గొడ్డలి వేటు వేసిందని తెలుగుదేశం పార్టీ నేత ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ విమర్శించారు. గత ప్రభుత్వ నిర్వాకాలకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 9 వేల కోట్లను ఆ పార్టీ దారి మళ్లించి, గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధి కోసం రూ. 32 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు.

పల్లె ప్రగతిపై గత ప్రభుత్వం గొడ్డలి వేటు..

గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 9 వేల కోట్లను ఆ పార్టీ దారి మళ్లించింది. కానీ నేడు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రత్యేక చొరవతో కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 'పల్లె పండుగ 1, 2, 3' కార్యక్రమాల ద్వారా రూ. 31,685 కోట్లు (దాదాపు రూ. 32వేల కోట్లు) ఖర్చు చేస్తోంది. దీని ద్వారా గ్రామాల్లో 12,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 19,100 కిలోమీటర్ల బీటీ రోడ్లను నిర్మించాం. గత వైసీపీ హయాంలో కేవలం 800 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే వేసి, అవి కూడా పైపైన తారు వేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద రాష్ట్రానికి రూ. 26 వేల కోట్లు కేటాయిస్తే, గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా నిధులను మురగబెట్టింది. కేవలం రూ. 2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి కేంద్ర నిధులతో కలిపి రూ. 4,128 కోట్ల అవినీతికి పాల్పడింది. నేడు ఆడపడుచుల కష్టాలపై పూర్తి అవగాహన ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర వాటా నిధులను విడుదల చేయడమే కాకుండా, కేంద్రంతో మాట్లాడి పథకం గడువును 2028 వరకు పొడిగించారు. దీని ద్వారా 95.44 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. అంతేకాకుండా, గ్రామాల్లోని ప్రతి ఇంటికీ 365 రోజులు, 24 గంటలూ నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు రూ. 30 వేల కోట్లతో భారీ వాటర్ ట్యాంకుల నిర్మాణం, మంచినీటి వ్యవస్థ బలోపేతానికి విస్తృత ప్రణాళిక రూపొందించారని వర్మ తెలిపారు.

ఉపాధి హామీ పథకంలో రూ.1,300 కోట్ల స్కామ్

గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ మస్టర్లలో వైసీపీ కార్యకర్తల పేర్లు చేర్చి దాదాపు రూ. 1,300 కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారు. నేడు కూటమి ప్రభుత్వం వ్యవస్థను ప్రక్షాళన చేసి అవినీతికి అడ్డుకట్ట వేసింది. 'వి బి జి రామ్ జీ' పథకం కింద కేంద్రం నుంచి 60 శాతం వాటాగా రూ. 2,226 కోట్లు రాగా, రాష్ట్ర వాటాగా రూ. 1,484 కోట్లు కలిపి పేదల కోసం ఖర్చు చేశాం. అంతేకాకుండా, ఉపాధి హామీ పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా ప్రతి పేద కుటుంబానికి అదనంగా 25 రోజుల ఉపాధి కల్పించాం. జగన్ మోహన్ రెడ్డి పాలనలో సరైన రోడ్లు లేక ఆసుపత్రులకు వెళ్లే దారిలోనే గర్భిణులు ఆటోలు, బస్సుల్లో ప్రసవించే దుస్థితిని కళ్లారా చూశాం. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేసింది. 2014-19 మధ్య రాష్ట్ర విభజన జరిగి నిధుల కొరత ఉన్నప్పటికీ, అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో పట్టుదలతో ఉపాధి హామీ నిధులను అనుసంధానిస్తూ దేశంలోనే వినూత్న విధానాలను తీసుకొచ్చారు. ఆ ఐదేళ్లలో రూ. 6,200 కోట్లతో 27,000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 22,000 కిలోమీటర్ల గ్రామీణ బీటీ రోడ్లు, 27 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో వెలుగులు నింపాం. నేడు చంద్రబాబు అనుభవం, పవన్ కళ్యాణ్ చొరవ, కూటమి ప్రభుత్వ సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ గ్రామాలు మళ్లీ స్వర్ణయుగం దిశగా అడుగులు వేస్తున్నాయని, గత పాలకుల విధ్వంసానికి, నేటి నిర్మాణాత్మక పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలందరూ గమనించాలని వర్మ కోరారు.

పల్లెల ప్రగతి కూటమి ప్రభుత్వ లక్ష్యం..

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధికి దూరమై గుంతల రోడ్లకు, చెత్త కుప్పలకు నిలయాలుగా మారాయని, నేడు కూటమి ప్రభుత్వం పల్లెల రూపురేఖలు మారుస్తోందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పల్లెల్లో కనీస అభివృద్ధి చేయకుండా రోడ్లను గుంతలమయంగా వదిలేసింది. పైగా నెలకు



రూ. 60 చొప్పున చెత్త పన్ను వసూలు చేసి కూడా, చెత్తను తొలగించకుండా రాష్ట్రవ్యాప్తంగా 81 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పోగేసి వదిలేసింది. నేడు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ 81 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిగా తొలగించడమే కాకుండా, గ్రామాల్లో నిజమైన శుభ్రత ఎలా ఉంటుందో చేసి చూపించింది. కూటమిలోని అన్ని పార్టీలు కలిసికట్టుగా పల్లెలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని వర్మ తెలిపారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

గత ప్రభుత్వం పంటలకు కనీస మద్దతు ధర విషయంలోనూ, మూడేళ్ల పాటు పంటల బీమా చెల్లింపుల్లోనూ రైతులకు ఎగనామం పెట్టింది. మద్దతు ధరల కోసం వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 880 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నేరుగా రైతుల ఖాతాల్లో రూ. 1,200 కోట్లు జమ చేసింది. గత పాలకులు ఫసల్ బీమా యోజనకు రాష్ట్ర వాటా చెల్లించకుండా కాలయాపన చేయడంతో పేరుకుపోయిన రూ. 2,000 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తూ, పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించింది. గత పాలకులు రివర్స్ టెండరింగ్ పేరుతో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పక్కన పెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులతో పాటు జీవనాడి పోలవరం పనులను పరుగులు పెట్టిస్తోంది. ఇప్పటికే పోలవరం ఎడమ కాలువ ద్వారా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం సాయంతో అనకాపల్లి, విశాఖపట్నం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నీళ్లు అందించారు. అంతేకాకుండా, నిరుపయోగంగా పెండింగ్‌లో పడి ఉన్న మరో 36 సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా పర్యవేక్షిస్తూ రూ. 35 వేల కోట్లతో పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో కొత్తగా 17 లక్షల ఎకరాలు సాగులోకి రావడమే కాకుండా, మరో 33 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. ఒకవైపు పల్లెల అభివృద్ధి, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతాంగాన్ని ఆర్థికంగా నిలబెట్టాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని వర్మ స్పష్టం చేశారు.

పేదల ఇళ్ల స్థలాల్లో దోపిడీ

గత వైసీపీ పాలనలో సెంటు పట్టా పేరుతో ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. ఊరికి ఆనుకుని కాకుండా 4 కిలోమీటర్ల దూరంలో తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి, అధిక ధరలకు ప్రభుత్వానికి అంటగడుతూ కమీషన్ల రూపంలో రూ. 7 వేల కోట్ల అవినీతి చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ 5.5 లక్షల ఇళ్లను పంపిణీ చేసిందని వర్మ తెలిపారు.

భూములకు రక్షణ

గత పాలకులు తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని, సుమారు 4 లక్షల ఎకరాలకు పైగా భూకబ్జాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రెండో సంతకంతో ఆ నల్ల చట్టాన్ని రద్దు చేయడమే కాకుండా, భూకబ్జాదారులకు 10 నుంచి 14 ఏళ్ల జైలు శిక్ష పడేలా 'ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్' తీసుకొచ్చారని చెప్పారు. అలాగే, సరిహద్దు రాళ్లు, పాసుపుస్తకాలపై గత ముఖ్యమంత్రి ఫోటోలను తొలగించి, ఎలాంటి వ్యక్తిగత ఫోటోలు లేకుండా 33 లక్షల కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు ఉచితంగా అందజేశామని పేర్కొన్నారు. గతంలో ధాన్యం అమ్ముకుంటే మూడు, నాలుగు నెలల వరకు రైతులకు డబ్బులు అందేవి కావని, నేడు 15 రోజుల నుంచి మూడు వారాల లోపే నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తితో పాటు, 'రామ్ జీ' (ఉపాధి హామీ) పథకంలో అవినీతికి అడ్డుకట్ట వేసి 125 రోజుల పని కల్పిస్తున్నామని చెప్పారు. 1వ తేదీ ఉదయం 6 గంటలకే ఇంటి తలుపు తట్టి పింఛన్ అందిస్తున్న ప్రభుత్వమిదని కొనియాడారు.

ఈ వయసులోనూ 35 ఏళ్ల యువకుడు కూడా పడలేనంత కష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలు, పల్లెల అభివృద్ధి, సాగునీటి రంగాల కోసం పడుతున్నారని వర్మ ప్రశంసించారు. 2014-19 నాటి అభివృద్ధి, తరువాత వైసీపీ ప్రభుత్వ విధ్వంసం, నేటి కూటమి పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని అన్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి శాలువాలు, బహుమతులు అక్కర్లేదని, ప్రజలు వేసే ఒక్క ఓటే పెద్ద గౌరవమని చెప్పారు. ఇటీవలి స్థానిక ఎన్నికల్లో కూటమికి వచ్చిన భారీ మెజారిటీ ప్రజల ఆశీస్సులకు నిదర్శనమని, ప్రజలంతా కలిసికట్టుగా ఉండి 2029లోనూ కూటమి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మండలాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

- మంత్రి కందుల దుర్గేష్

- నూతన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలకు మంత్రి దుర్గేష్ ఉద్బోధ
- పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల నూతన ఎంపీటీసీల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి
- ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక కార్యక్రమానికి హాజరు
- ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ధృవీకరణ పత్రాలు అందజేసి అభినందనలు తెలిపిన మంత్రి



నిడదవోలు (చైతన్యరథం): పదవులు అలంకారం కాదు.. ప్రజాసేవకు బాధ్యత అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తూర్పుగోదావరిజిల్లా నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లో గురువారం నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాలకు స్వయంగా హాజరైన మంత్రి దుర్గేష్ ప్రజామోదంతో ఎన్నికైన ప్రతి సభ్యుడిని ఆప్యాయంగా పలకరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పెరవలి మండల నూతన ఎంపీపీగా ఎన్నికైన దాసం నరసవేణి, వైస్ ఎంపీపీ అక్కిన నాగమణికి, ఉండ్రాజవరం ఎంపీపీ చిట్టూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కాపకాయల కుమారికి, నిడదవోలు ఎంపీపీ చదలవాడ నతానియేలు రాజు, వైస్ ఎంపీపీ కొప్పిరెడ్డి గాయత్రీ దేవిలకు ఎన్నికల ధృవీకరణ పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కీలక సూచనలు చేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఆ తర్వాత పార్టీ లకు అతీతంగా ప్రజాసేవకే అంకితమై పనిచేయాలని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కట్టబెట్టిన ఈ పదవులను బాధ్యతగా స్వీకరించి, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేరువ చేయాలి

గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా స్థానిక నాయకులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ ఆదర్శ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలన్నారు.ప్రత్యేకించి గ్రామాల్లో,మండలాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారుల వంటి కనీస మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. గెలిచిన తర్వాత నాయకులు ప్రజలకు దూరంగా ఉండకూడదని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నప్పుడే నిజమైన ప్రజాప్రతినిధులుగా గుర్తింపు లభిస్తుందని హితవు పలికారు.

అమరజీవి జలధార పనుల వేగవంతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెరవలి మండలంలో శంకుస్థాపన చేసిన 'అమరజీవి జలధార' కార్యక్రమ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలుతీసుకోవాలని మంత్రి దుర్గేష్ తెలిపారు. తద్వారా ప్రజలందరికీ ఇంటింటికీ శుద్ధి చేసిన సురక్షిత గోదావరి మంచినీటిని అందించేలా యుద్ధ ప్రాతిపదికన కృషి చేయాలన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రజాప్రతినిధులుగా అత్యధిక అవకాశాలు కల్పించి మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందని, ఇందుకు నిదర్శనంగా పెరవలి మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవుల రెండింటిలోనూ మహిళలే ఎన్నిక కావడం గమనార్హమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మూడు మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా జరగడానికి సహకరించిన ఎన్నికల అధికారులకు, పోలీసు యంత్రాంగానికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రికి కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం చివరలో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులతో మంత్రి గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపీడీవోలు, ఇతర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి మంత్రి సతీమణి నామినేషన్

బనగానపల్లె (చైతన్యరథం): రాష్ట్ర మంత్రి జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరారెడ్డి.. నంద్యాలజిల్లా బనగానపల్లి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో.. రిటర్నింగ్ అధికారికి గురువారం నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ సందర్భంగా మంత్రి సతీమణి ఇందిరా రెడ్డి మీడియాతో మాట్లాడారు. బనగా నపల్లి పంచాయతీని అభివృద్ధి చేయడ మే తన లక్ష్యమని.. అందుకే సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో పాల్గొంటున్నానని ఆమె పేర్కొన్నారు. నామినేషన్ అనంతరం ఆమెకు కూటమినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె విజయం కోసం కూటమి ఎల్లప్పుడూ పాటుపడుతుందని తెలిపారు. కాగా ఈనామినేషన్ ప్రక్రియలో మంత్రి జనార్దన్ రెడ్డితో పాటు టీడీపీ, జనసేన,బీజేపీ నేతలు పాల్గొన్నారు.



మండలాధ్యక్ష పదవుల్లో.. 90 శాతానికి పైగా కూటమి ఖాతాలో!

- 601 మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పూర్తి
- పెండింగ్ 58 స్థానాల్లో నేడు ఎన్నిక
- లాటరీల్లో టీడీపీ పైచేయి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మండలాధ్యక్ష పదవులకు గురువారం జరిగిన ఎన్నికల్లో 90 శాతానికి పైగా కూటమి చేజిక్కించుకుంది. మొత్తం 659 మండల పరిషత్‌లకు గాను 601 చోట్ల ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తెలిపింది. 58 మండల ప్రజాపరిషత్‌ల్లో పెండింగ్ ఉన్నట్లు పేర్కొంది.

పెండింగ్ స్థానాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు జరుగుతాయని వివరించింది. మన్యం, విశాఖ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు పూర్తయ్యాయని వివరించింది.

లాటరీలో టీడీపీకే మొగ్గు

రాష్ట్రవ్యాప్తంగా పలు మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఐదు చోట్ల బలాలు సమానం కావడంతో, అధికారులు లాటరీ (లక్కీ డ్రా) పద్ధతిని ఆశ్రయించారు. అయితే, ఈ లక్కీ డ్రా ఫలితాలు వైసీపీకి గట్టి షాక్ ఇవ్వగా, టీడీపీకి మాత్రం "లక్కీ లక్ష్మీ" కటాక్షం లభించినట్లయింది. ఈ ఐదు మండలాల్లో ఇరు పార్టీల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నప్పటికీ, తుది ఫలితంలో మాత్రం నాలుగుచోట్ల అదృష్టం టీడీపీ పక్షానే నిలిచింది

సైదాపురం (తిరుపతి): ఇక్కడ ఇరు పార్టీలకు సమానంగా సీట్లు రావడంతో నిర్వహించిన లాటరీలో టీడీపీ అభ్యర్థి పొట్టేళ్ల పార్వతిని అదృష్టం వరించింది.

గుర్ల (విజయనగరం): ఇక్కడ కూడా బలాలు సమానం కావడంతో, లక్కీ డ్రా ద్వారా టీడీపీ అభ్యర్థి సన్యాసినాయుడు ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

ఓబులదేవర చెరువు (శ్రీసత్యసాయి జిల్లా): 14 ఎంపీటీసీ స్థానాలకు గాను చెరో ఏడు చోట్ల గెలవడంతో లాటరీ అనివార్యమైంది. ఇందులో టీడీపీకి చెందిన పిట్టా ఓబులరెడ్డి విజయం సాధించారు.

ఉంగుటూరు (కృష్ణా): 16 స్థానాల్లో టీడీపీ 8, వైసీపీ 7 గెలుచుకోగా, సీపీఎం మద్దతుతో వైసీపీ బలం సమానం చేసుకుంది. ఎంతో ఉత్కంఠగా సాగిన ఈ పోరులో చివరకు లాటరీ పద్ధతిలో టీడీపీ అభ్యర్థి సుజితనే అదృష్టం వరించింది.

మునగపాక (అనకాపల్లి): నాలుగు చోట్ల నిరాశ ఎదురైనా, ఒక్క మునగపాకలో మాత్రం వైసీపీ అభ్యర్థి మొల్లేటి శంకర్‌ను లక్కీ డ్రాలో అదృష్టం వరించి ఆ పార్టీ పరువు నిలిపింది.

కాగా క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలం పెరగడంతో పాటు అదృష్టం కూడా తోడవ్వడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

- 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న నామినేషన్ల పరిశీలన
- 27న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం
- డిసెంబర్ 2న అవసరమైన చోట్ల పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నిక
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడో విడత ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ విడతలో రాష్ట్రంలోని 25 జిల్లాలకు చెందిన వివిధ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండలాల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 21వ తేదీన సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసులు జారీ చేసి, అదే రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుంది.

24వ తేదీన ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. 25వ తేదీన నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్లను స్వీకరిస్తారు. 26వ తేదీన అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

ఎన్నికలు అవసరమైన గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 2వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహిస్తారు. ఏదైనా కారణంతో ఆ రోజు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాకపోతే, మరుసటి రోజు ఎన్నిక నిర్వహిస్తారు.

రీపోలింగ్ అవసరమైన సందర్భాల్లో డిసెంబర్ 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. రీపోలింగ్ నిర్వహించిన గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచ్ ఎన్నికను రీపోలింగ్ ఫలితాలు ప్రకటించిన తర్వాతే నిర్వహిస్తారు.

చైతన్యరథం

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ విషప్రచారం

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- వైసీపీ ప్రభుత్వం పెట్టిన రూ.వేల కోట్ల బకాయిలు చెల్లిస్తున్న కూటమి ప్రభుత్వం
- క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నాం
- విద్యార్థులకు, యాజమాన్యాలకు అండగా మంత్రి లోకేష్
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ, విద్యా విధానం, ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి వైసీపీ నాయకత్వం మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారం కోల్పోయాక మరోలా ఏది పడితే అది మాట్లాడొచ్చనే ఒక వింత పోకడకు వైసీపీ నేతలు తెరలేపారని మండిపడ్డారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించి, పదవి నుంచి దించేసిన సమయంలో రాష్ట్రంలో మీరు ఎన్ని వేల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి వెళ్లారో ఒకసారి గుర్తు చేసుకోవాలి. ఐదేళ్ల పాలనలో విద్యా రంగాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేసి, విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది వైసీపీ ప్రభుత్వమే. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్లు కూడా తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలేజీ యాజమాన్యాలను, తల్లిదండ్రులను వేధింపులకు గురిచేసి, ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆలపాటి ధ్వజమెత్తారు.

ప్రతి రంగంలోనూ బకాయిలే

గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో చిన్న పిల్లల చదువుల నుంచి సాంకేతిక విద్య, ఆరోగ్యశ్రీ, రైతులు, కాంట్రాక్టర్ల వరకు అన్ని రంగాల్లో వేల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. గతంలో అమ్మఒడి (నేటి తల్లికి వందనం), సాంకేతిక విద్య, ఆరోగ్యశ్రీ పథకాలలో భారీగా బకాయిలు పెట్టారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పనులు చేసిన కాంట్రాక్టర్లకు, గ్రామీణాభివృద్ధికి ఉపాధి హామీ నిధులతో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టారు. పైగా, సీఎఫ్ఎంఎస్ అనే కొత్త విధానాన్ని అడ్డుపెట్టుకుని, కేవలం మీ మద్దతుదారులకు, మీకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే నిధులు మంజూరు చేసి నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. గత ప్రభుత్వం పెట్టిన ఈ బకాయిలన్నింటినీ కూటమి ప్రభుత్వం భారం అనుకోకుండా తన బాధ్యతగా స్వీకరించింది. రైతులకు రావాల్సిన బకాయిలను చెల్లించడంతో పాటు, విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పాత బకాయిలను దశలవారీగా తీరుస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నాం. విద్యార్థులపై ఎలాంటి మానసిక, శారీరక ఒత్తిడి తీసుకురావద్దని, ఫీజుల విషయంలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుందని కాలేజీ యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. 2019--24 మధ్య కాలంలో ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా ఫీజు ఫిక్సేషన్ కమిటీని ఏర్పాటు చేసి, వారికి అనుకూలమైన కాలేజీలకు ఫీజులు పెంచి, మిగతా కాలేజీల్లో ఎన్ని సౌకర్యాలు ఉన్నా కనీస ఫీజును రూ. 35,000 కు తగ్గించి కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు సరైన విద్యా విధానం లేకుండా విద్యార్థి లోకాన్ని మోసం చేశారు. పీజీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.వేల కోట్లు బకాయి ఉంటే, కాలేజీ యాజమాన్యాలను పిలిచి 75 శాతం మాత్రమే ఇస్తామని సంతకాలు పెట్టించుకున చివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిన



చరిత్ర మీది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు అతీతంగా అన్ని విద్యా సంస్థలను బతికించాలనే లక్ష్యంతో సగటు ఫీజును రూ. 45,000 కు సవరించింది. అంతేకాకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 2024-25లో రూ. 1,450 కోట్లు, 2025-26లో రూ. 1,666.21 కోట్లు, ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 1,845 కోట్లు.. వెరసి మొత్తం రూ. 4,962 కోట్లు కేటాయించి విద్యా రంగానికి అండగా నిలిచింది. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రతి యువకుడికి నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

ఊరికే బటన్లు నొక్కడం కాదు.. ఖాతాల్లో డబ్బులు పడాలి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా రంగానికి తీరని ద్రోహం జరిగిందని, ఊరికే బటన్లు నొక్కడం కాకుండా అర్హుల ఖాతాల్లో నిధులు జమ చేయడమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. మేము ఏదైతే చెప్తామో అదే చేస్తాం, చేసేదే చెప్తాం. కానీ గత ప్రభుత్వంలో అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పేరుతో విద్యార్థి లోకాన్ని మోసం చేశారు. వసతి దీవెన కింద హాస్టళ్లకు బకాయిలు పెట్టడమే కాకుండా, కొన్ని చోట్ల మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ఎత్తివేసి పేద విద్యార్థుల పొట్టకొట్టారు. ఫీజుల నిర్ధారణ (ఫీజ్ ఫిక్సేషన్), అడ్మిషన్ల ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం వల్ల మన రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మీ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం కావాలి.. మా పిల్లలకు వద్దా?' అంటూ రాజకీయ లబ్ధి కోసం మాటలు చెప్పారే తప్ప, క్షేత్రస్థాయిలో సరైన అమలు లేకుండా చేశారు. 'నాడు-నేడు' పథకం కింద రూ. 4 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకున్నా, ఏ ఒక్క పాఠశాల కూడా పూర్తిస్థాయిలో, నాణ్యతతో నిర్మించలేదు. గుడి లాంటి బడుల నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడి, ప్రధానోపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి వారి ఆత్మహత్యలకు కారణమయ్యారు. గతంలో 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు పభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేశాం. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, వైసీపీ పెట్టిన బకాయిలన్నింటినీ మా బాధ్యతగా స్వీకరించి సరిదిద్దుతున్నాం. సామాన్య పేద విద్యార్థి టెన్త్ క్లాస్‌లో మెరిట్ సాధిస్తే వారి ఫోటోలను పత్రికల మొదటి పేజీలో ప్రచురించి ప్రోత్సహించే విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రైవేట్ విద్యాసంస్థలన్నింటినీ ఒకే రీతిలో చూస్తూ, వాటి సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ఒకటి రెండు రోజులు అటుఇటు అయినా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుందని కాలేజీ యాజమాన్యాలకు భరోసా ఇస్తున్నాం. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు, యాజమాన్యాలకు అండగా నిలుస్తున్నారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా ముసలి కన్నీరు కార్చడం, మోసపూరిత మాటలతో ప్రజలను భ్రమలకు గురిచేయడం మానుకోవాలి. రాష్ట్ర అభివృద్ధికి, విద్యా వ్యవస్థకు అడ్డుపడాలని చూస్తే నష్టపోయేది మీరేనని ఆలపాటి రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు.

ఈడీ ఛార్జిషీట్‌పై జగన్ నోరు విప్పాలి

- అక్రమాస్తుల కేసులో అవినీతి ఆరోపణలపై సమాధానం చెప్పే బాధ్యత లేదా?
- లిక్కర్ కుంభకోణం నుండి శాండ్ స్కామ్ వరకు వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే
- తేలు కుట్టిన దొంగల్లా జగన్, గొడ్డలిపార్టీ నేతలు
- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

అమరావతి (చైతన్యరథం): జగన్మోహన్ రెడ్డిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై గొడ్డలి పార్టీ నేతల పెదవి విప్పాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అక్రమాస్తుల కేసులో ఈడీ ఛార్జిషీటు వేస్తే సమాధానం చెప్పే బాధ్యత జగన్మోహన్ రెడ్డికి లేదా? అని ప్రశ్నించారు. ప్రత్యేక విమానంలో వచ్చి ఏకధాటిగా రెండు గంటలకు పైగా కూటమి ప్రభుత్వంపై బురద జల్లే జగన్ రెడ్డి ఈడీ విచారణపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. అసత్యాలను పెద్ద పెద్ద అక్షరాలతో రాస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సాక్షి పత్రిక జగన్మోహన్ రెడ్డి కేసులపై చిన్న వార్త కూడా ఎందుకు రాయలేదని అని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మాట్లాడిన ఆయన.. హాలీవుడ్ సినిమాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా జగన్మోహన్ రెడ్డి అవినీతి సామ్రాజ్యం స్థాపించారని విమర్శించారు. లిక్కర్ కుంభకోణం నుండి శాండ్ స్కామ్ వరకు వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్న దీనిపై ఆ పార్టీ నాయకులు తెలు కుట్టిన దొంగళ్లలా ఎందుకు



ఉంటున్నారని దుయ్యబట్టారు.

మనీలాండరింగ్ నిజం కాదా?

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమ ఆస్తులు, క్విడ్ ప్రో కో వ్యవహారాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్ల ద్వారా మరోసారి వాస్తవాలు ప్రజల ముందుకు వచ్చాయి. క్విడ్ ప్రో కో-1 నుంచి క్విడ్ ప్రో కో-2 వరకు జగన్మోహన్‌రెడ్డి పాత్రను దర్యాప్తు సంస్థలు సాక్ష్యాధారాలతో సహా నిర్ధారించాయి. ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన సహజ వనరులను అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్వప్రయోజనాలకు ఎలా వాడుకున్నారో ఈడీ వేసిన ఛార్జిషీట్ స్పష్టం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి పక్కన చేరిన ఎంత మంచి వ్యక్తులు, అధికారులు, పారిశ్రామికవేత్తలైనా సరే అవినీతి మరక అంటక తప్పదని ఈ ఛార్జిషీట్ రుజువు చేస్తుంది. ఐఏఎస్ అధికారులను సైతం జైలుకి పంపించిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. 2008 జనవరి 9న కడపజిల్లా మైలవరం మండలం తలమంచిపట్నంలో 407 హెక్టార్ల సున్నపురాయి గనులను సజ్జల కుటుంబానికి చెందిన ఈశ్వర్ సిమెంట్స్‌కు మంజూరు చేశారు. ఆ తర్వాత జీవో నెం. 321 ద్వారా వాటిని దాల్మియా సిమెంట్స్‌కు కట్టబెట్టారు. ఈ లీజుల వ్యవహారంలో క్విడ్ ప్రో కో జరిగిందని కేంద్ర దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఈడీ ఛార్జిషీట్‌లో జగన్మోహన్‌రెడ్డిని ఎ1 నిందితుడిగా నమోదు చేశారు. 2010లో దాల్మియా సిమెంట్స్ షేర్లను ఫ్రాన్స్ కంపెనీ పార్ఫిసిమ్ కొనుగోలు చేయడం ద్వారా వచ్చిన రూ. 139కోట్లను జగన్మోహన్‌రెడ్డి తనకంపెనీలకు మళ్లించారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్ మాఫియా తరహాలో 'టన్నులు' అనే కోడ్ భాషను ఆ రోజుల్లోనే ఉపయోగించారంటే జగన్ క్రిమినల్ మైండ్ సెట్ ఏంటో అర్థమవుతుంది. ఈడీ స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్ సమాచారం ప్రకారం రూ.55కోట్ల హవాలా రూపంలో చేరింది వాస్తవం కాదా? సజ్జల కుటుంబానికిచెందిన ఈశ్వర్ సిమెంట్స్‌కు రూ. 2.14 కోట్ల మనీలాండరింగ్ జరిగిందని దర్యాప్తు సంస్థలు స్పష్టం చేయడం నిజం కాదా? దీనిపై గొడ్డలి పార్టీ అధినేత, ఆ పార్టీ నాయకులు ఏం సమాధానం చెబుతారని ఎమ్మెల్యే బొండా ప్రశ్నించారు.

అవినీతి సొమ్ము వాటాలను పంచడానికి కూడా మనసు రాదా?

దేశ చరిత్రలో 'క్విడ్ ప్రో కో' అనే పదాన్ని తొలిసారిగా సృష్టించిన వ్యక్తి జగన్. బోగస్ కంపెనీల ద్వారా రూ. 43 వేల కోట్ల అవినీతి సొమ్మును కూడబెట్టారు. ఈ అక్రమ సంపాదనతోనే భారతీ సిమెంట్స్ నుంచి సాక్షి పత్రిక వరకు, లోటస్ పాండ్ నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు వేల కోట్ల ఆస్తులు సమకూర్చుకున్నారు. తండ్రి అధికారంతో అవినీతి సొమ్ము సంపాదించారు. తన అధికారంతో వ్యవస్థలను మ్యానేజ్ చేసి గత 13 ఏళ్లుగా బెయిల్‌పై తిరుగుతున్న వ్యక్తి జగన్. సుమారు 141 డిశ్చార్జ్ పిటిషన్లు, 3,400కు పైగా వాయిదాలతో విచారణ నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. అక్రమంగా సంపాదించిన ఆస్తుల్లో కూడా తల్లికి, చెల్లికి వాటా ఇవ్వని హీన చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. జగన్మోహన్ రెడ్డి వద్ద పనిచేసే ఒక సాధారణ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, మలేషియా వంటి దేశాల్లో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించి వెయ్యి కోట్ల రూపాయలు కూడబెట్టాడంటే, ఆ అవినీతి సామ్రాజ్యం ఏ స్థాయిలో విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. ఆయన దగ్గర పనిచేసిన ఉద్యోగులే వేల కోట్లు సంపాధిస్తే జగన్ ఎన్ని లక్షల కోట్లు సంపాదిస్తున్నాడో ప్రజలు అర్థం చేసుకోవాలి. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌పై గానీ, లిక్కర్ కుంభకోణం ఆరోపణలపై గానీ జగన్మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ నేతలు మౌనవ్రతం పాటిస్తున్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో సునీతా రెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు, ఆస్తుల పంపకాలపై సొంత తల్లి, చెల్లి లేవనెత్తిన అంశాలకు కూడా వారు సమాధానం చెప్పడం లేదు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని జగన్మోహన్ రెడ్డికి, ఆ పార్టీ నేతలకు ప్రజల్లో తిరిగే నైతిక హక్కు లేదని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు.

పాలకొల్లు ఎంపీపీగా అంగర వీరభద్రకుమార్

- **ఉపాధ్యక్షురాలిగా సాయి లక్ష్మి**
- **అభినందించిన మంత్రి నిమ్మల రామానాయుడు**

పాలకొల్లు (చైతన్యరథం): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా తెలుగుదేశం పార్టీకి చెందిన అంగర వీరభద్రకుమార్ (చిన్న), ఉపాధ్యక్షురాలిగా సాయి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీకి చెందిన 18 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరై అంగర వీరభద్రకుమార్‌ను అధ్యక్షుడిగా, సాయి లక్ష్మిని ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు.

ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, ఉపాధ్యక్షురాలితో పాటు ఎంపీటీసీ సభ్యులందరూ మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి, తమకు పదవులు దక్కేలా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన ఎంపీపీ, ఉపాధ్యక్షురాలితో పాటు ఎంపీటీసీ సభ్యులను మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పారదర్శకమైన పాలన అందించాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని హితవు పలికారు.


పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. గత రెండున్నరేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.1,275 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరింత కష్టపడి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, ఉపాధ్యక్షురాలు, ఎంపీటీసీ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తనకు పూర్తి సహకారం అందిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.





డిజిటల్ అరాచకానికి అడ్డుకట్ట వెయ్యాలి!



రాజకీయాలు వ్యాపారమయమైనప్పటి నుంచీ విలువలు మంటగలిసిపోయాయి. ప్రత్యర్థులను సిద్ధాంతపరంగా ఎదుర్కోలేని అసమర్థతతో, వ్యక్తిగత దూషణలే ఆయుధాలుగా మారాయి. కొన్ని రాజకీయ పార్టీల్లో... ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ విష సంస్కృతి పరాకాష్టకు చేరింది. సామాజిక మాధ్యమాల విస్తృతి పెరిగిన తర్వాత నకిలీ ఖాతాల మాటున నచ్చని రాజకీయ పార్టీల నాయకులను, వ్యవస్థలను, వారి కుటుంబ సభ్యులను అత్యంత జుగుప్సాకరమైన భాషతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం నిత్యకృత్యమైంది. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని తల్లులు, భార్యలు, కుమార్తెలను వివాదాల్లోకి లాగడం, మార్ఫింగ్ ఫొటోలు, అసభ్యకరమైన పోస్టులతో వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం ఒక వికృత క్రీడగా మారింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ దాటి... ఇప్పుడు 'ఎక్స్' (ట్విటర్) వేదికగా బహిరంగంగానే బూతు పురాణంతో రెచ్చిపోవడం సభ్య సమాజానికే సిగ్గుచేటు. ఈ డిజిటల్ అరాచకానికి అడ్డుకట్ట వేయకపోతే ప్రజాస్వామ్య మనుగడకే పెను ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని మన అరచేతిలోకి తెచ్చింది. సమాచారాన్ని క్షణాల్లో అందించే అద్భుత సాధనంగా ఆవిర్భవించిన ఈ సోషల్ మీడియా సామాన్యుడికి సైతం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే గొప్ప అవకాశాన్ని కల్పించింది. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో తెలుసుకునే వీలు కల్పించింది. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకగా, సామాజిక చైతన్యానికి వేదికగా నిలవాల్సిన సోషల్ మీడియా వికృత సంస్కృతి ఆందోళన కలిగిస్తోంది. నిత్యం భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో బూతుల పురాణాలు, వ్యక్తిగత దూషణలు గిట్టని వారిపై జుగుప్సాకరమైన పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు నలుగురిలో మాట్లాడటానికి సిగ్గుపడే మాటలను నేడు లక్షల మంది వీక్షించే సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడిగా ప్రసారం చేస్తున్నారు. కొన్ని సోషల్ మీడియా వేదికలు నీచంగా దిగజారిపోతున్నాయి. ఇది ఆధునిక సమాచార విప్లవమా? లేక భాషా సంస్కారానికి పట్టిన గ్రహణమో అర్థం కావడం లేదు.

ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం. ప్రభుత్వాల విధానాలను, పాలకుల తప్పులను ప్రశ్నించడంలో, రాజకీయ నాయకుల పనితీరును విశ్లేషించడంలో తప్పులేదు. కానీ నేడు విమర్శకన్నా వ్యక్తిగత దూషణకే ప్రాధాన్యత ఇస్తున్నారు. సిద్ధాంతాలతో పోరాడలేనివారు బూతులను ఆయుధాలుగా చేసుకొని ప్రజాస్వామ్యానికి తలకొరివి పెడుతున్నారు. ఒక నాయకుడి విధానాలను రాజకీయంగా విభేదించడం వేరు. వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డం వేరు. ఈ కనీస విచక్షణ కొరవడటమే నేటి దుస్థితికి ప్రధాన కారణం. తమకు నచ్చని వ్యక్తులపై బురదజల్లేందుకు కొందరు సోషల్ మీడియాను అడ్డాగా మార్చుకున్నారు. తప్పుడు ప్రచారాలు, మార్ఫింగ్ చిత్రాలు, అసభ్య వీడియోలు, కించపరిచే వ్యాఖ్యలతో వ్యక్తుల గౌరవాన్ని మంటగలుపుతున్నారు. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని చేసే అసభ్య వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా వున్నాయి. మహిళల గౌరవానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఈ వికృత సంస్కృతిని ఎంతకాలం భరించాలి. సోషల్ మీడియా వేదికలపై వ్యూస్, లైకులు, షేర్ల కోసం జరుగుతున్న పోటీ మరో ప్రమాదకరమైన పరిణామం. మంచిగా మాట్లాడితే పట్టించుకోరనే భావనతో కొందరు అసభ్య పదజాలాన్ని ఎన్నుకున్నారు. వ్యక్తులను కించపరుస్తూ వీడియోలు రూపొందిస్తున్నారు. కొందరు యూట్యూబ్ ఛానళ్లు, సోషల్ మీడియా ఖాతాలు వార్తల పేరుతో బూతుల రోతకి తెగబడుతున్నాయి. వాస్తవాలను విశ్లేషించాల్సిన వేదికలు వ్యక్తిగత దూషణలకు వేదికలయ్యాయి. సంచలనమే వార్తగా, అసభ్యతే వినోదంగా మారిన దుస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి కంటెంట్‌కు ఆదరణ పెరిగితే మరింత మంది అదే మార్గాన్ని ఎంచుకునే ప్రమాదం ఉంది. దీనివల్ల యువతలో భాషా సంస్కారం, పరస్పర గౌరవం, సామాజిక బాధ్యత దెబ్బతినే అవకాశం ఉంది. సమాచారాన్ని అందించాల్సిన సాంకేతిక వేదికలు అసభ్యతను వ్యాపారం చేసుకోవడం ఎంతవరకు సమర్థనీయం?

సినిమాలకు సెన్సార్ వ్యవస్థ ఉంది. టెలివిజన్ ప్రసారాలకు కొన్ని నియంత్రణలు ఉన్నాయి. పత్రికలకు సంపాదకీయ బాధ్యత, జర్నలిస్టులకు వృత్తి నియమావళి ఉన్నది. మరి కోట్లాదిమంది ఉపయోగిస్తున్న సోషల్ మీడియాకు మాత్రం బాధ్యతాయుతమైన నియంత్రణ లేదు. ఇక్కడ సెన్సార్ అంటే రాజకీయ విమర్శలను కట్టడి చెయ్యడం కాదు. బూతులతో అసభ్యకరంగా వ్యక్తిత్వ హననం చేసే వ్యాఖ్యలను, మహిళలపై వేధింపులు, బెదిరింపులు, పరువు తీసే దుష్ప్రచారాన్ని అరికట్టే వ్యవస్థ ఉండాలన్నదే అసలు ఉద్దేశం. తెలుగు భాషలో బూతులు, ద్వంద్వార్థాలు, అసభ్య పదజాలాన్ని గుర్తించగల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్లాట్ ఫామ్‌లు వినియోగించాలి. అభ్యంతరకరమైన పోస్టులపై హెచ్చరికలు ఉండాలి. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడే ఖాతాలను నిలిపివేయాలి. డిజిటల్ అరాచకం జరుగుతున్నప్పుడు ప్రభుత్వాలు చూసీచూడనట్టు వ్యవహరించడం సమర్థనీయం కాదు. సోషల్ మీడియాపై నియంత్రణకు సమాచార సాంకేతిక చట్టం-2000, ఐటీ నిబంధనలు-2021 వంటి చట్టాలు ఇప్పటికే అమల్లో ఉన్నాయి. చట్టాలు, నిబంధనలు ఉన్నప్పటికీ అమలులో చిత్తశుద్ధి కొరవడటం వల్లనే సోషల్ మీడియాలో అసాంఘిక శక్తులు అంతకంతకూ రెచ్చిపోతున్నాయి. సినిమా రంగానికి సెన్సార్ బోర్డు ఉన్నట్లుగానే... డిజిటల్ మీడియాకు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యే కంటెంట్‌కు కూడా కఠినమైన నియంత్రణ ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విష సంస్కృతిని ఇక్కడితో నిరోధించకపోతే రాబోయే తరాలకు మనం ఇటువంటి సంస్కారాన్ని అందించిన వారమవుతాం.

ప్రధానంగా సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నది యువతే. వారు చూసేది, వినేది, అనుసరించేది వారి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతుంది. నిత్యం బూతులు, దూషణలు, అసభ్య వ్యాఖ్యలు కనిపిస్తుంటే అవే సాధారణ భాషగా భావించే ప్రమాదం ఉంది. ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలకు సంస్కారం నేర్పుతుంటే, బయట సామాజిక మాధ్యమాలు అసభ్యతను పరిచయం చేస్తూ వారి భవిష్యత్తు బలిపెడుతున్నాయి. సాంకేతిక అభివృద్ధి మనిషి ఆలోచనలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కానీ అది విచక్షణను, సంయమనాన్ని, పరస్పర గౌరవాన్ని దెబ్బతీస్తే ఆ అభివృద్ధికి అర్థం ఏముంది? సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ అవగాహన, ఆన్‌లైన్ ప్రవర్తనా నియమాలు, ఇతరుల గౌరవాన్ని కాపాడే సంస్కారం ఉండాలి. సోషల్ మీడియా ఎవరి మీద వ్యక్తిగత కక్షలు తీర్చుకునే వేదిక కాదు. ఎదుటివారిని బూతులతో అవమానించే హక్కు ఎవరికీ ఇవ్వలేదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, విమర్శించే హక్కు, అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉంది. కానీ బూతులతో వ్యక్తిత్వ హననం చేస్తూ ఇతరుల గౌరవాన్ని కాలరాసే హక్కు మాత్రం లేదు. ఒకరి స్వేచ్ఛ, స్వార్థం కోసం మరొకరి హక్కులకు భంగం కలిగించకూడదన్న కనీస సూత్రాన్ని పాటించాలి. సోషల్ మీడియా సంస్థలు బాధ్యత వహించాలి. రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలకు కట్టడి చెయ్యాలి. అందరూ స్వీయ నియంత్రణ పాటించకపోతే రాబోయే రోజుల్లో సోషల్ మీడియా సమాచార వేదికగా కాకుండా అసభ్యతకు, అశ్లీలతకు, బూతుల రోతకు చిరునామాగా మిగిలిపోతుంది. విమర్శకు విజ్ఞత ఉండాలి. స్వేచ్ఛకు సంయమనం తోడవ్వాలి. బూతులు మాట్లాడితేనే గుర్తింపు వస్తుందనే భ్రమ నుంచి బయటపడాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, పౌర సమాజం ఏకమై డిజిటల్ అరాచకానికి అడ్డుకట్ట వేయాలి. సోషల్ మీడియా నిబంధనలను కఠినతరం చేసి బాధ్యతారహితంగా బూతులు మాట్లాడేవారికి కఠిన శిక్షలు ఖరారు చేయాలి. లేదంటే ఈ గాలి మీడియా హోరులో ప్రజాస్వామ్య విలువలు కొట్టుకుపోవడం ఖాయం.

- నీరుకొండ ప్రసాద్

మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారికంగా నోటిఫికేషన్ వెలువడింది. రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈ మూడో దశ నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ విడతలో జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్లకు పరిధిలోని మొత్తం తొమ్మిది మండలాల్లో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఎన్నికలు జరగనున్న తొమ్మిది మండలాలను రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా విభజించారు. విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలో భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ, విజయనగరం మండలాలు ఉన్నాయి. అలాగే చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో చీపురుపల్లి, మెరకముడిదాం, గరివిడి, గుర్ల మండలాల్లో ఓటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 21న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. అదే రోజు వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించడంతో పాటు, ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభిస్తారు. నామినేషన్లు దాఖలు చేయడానికి నవంబర్ 23 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. ఆ మరుసటి రోజు అంటే నవంబర్ 24 ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు.

నామినేషన్ల తిరస్కరణకు సంబంధించి అభ్యంతరాలు లేదా అప్పీళ్లు ఉంటే నవంబర్ 25 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఆర్డీవోకు సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 26న అప్పిలేట్ అథారిటీ ఈ అప్పీళ్లను పరిష్కరిస్తుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి నవంబర్ 27 మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఇస్తారు; ఆ తర్వాత పోటీలో మిగిలిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.డిసెంబర్ 2న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. ఓటింగ్ ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలు వచ్చిన రోజునే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహిస్తారు. అనివార్య కారణాల వల్ల ఆ రోజు సాధ్యం కాకపోతే, సెలవు దినమైనప్పటికీ మరుసటి రోజు ఉప సర్పంచ్ ఎన్నిక చేపడతారని అధికారులు స్పష్టం చేశారు. గ్రామీణ స్థాయిలో పాలనకు పునాదిగా నిలిచే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకం వంటి అంశాలపై దృష్టి సారించారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఓటర్లు నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు.

పార్టీ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది



ఆమదాలవలస (చైతన్యరథం): ఆమదాలవలస మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆమదాలవలస మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత అన్నారు. గురువారం ఆమదాలవలస మున్సిపాలిటీ 19, 3 వార్డులలో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి తమ్మినేని అనురాధతో పాటు ఆమె పర్యటించారు. ప్రతి ఒక్కరూ మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి కూన ప్రమీల, వార్డు కౌన్సిల్ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం మండల పరిషత్ ఎంపీపీగా కోరాడ తులసి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం మండల పరిషత్ ఎంపీపీగా కోరాడ తులసి, వైస్ ఎంపీపీగా సుంకరి కళ్యాణ దేవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయంలో పదిమంది టీడీపీ ఎంపీటీసీ సభ్యులు వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.జ్యోతి శ్రీ ఎంపీడీవో జి. వెంకట్రావులు వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ఎంపీపీ తులసి, వైస్ ఎంపీపీ కళ్యాణి దేవిలను విజయనగరం మేయర్ అవనాపు భార్గవి, తెదేపా నాయకులు పూసపాటి రాజేష్ బాబు, గంట పోలినాయుడు, బొద్దుల నర్సింగరావు, ఐవీపీ రాజు, సుంకరి పైడిరాజు నగరానికి చెందిన కార్పొరేటర్లు, నాయకులు అభినందించారు.

బుట్టాయగూడెం, పోలవరం ఎంపిపిల ప్రమాణస్వీకారం



బుట్టాయగూడెం (చైతన్యరథం): ఏలూరు జిల్లా బుట్టాయగూడెం ఎంపిపిగా కొమరం మల్లేశ్వరరావు (టీడీపీ), వైస్ ఎంపీపీగా మిడియం సునీత (జనసేన) ఎన్నికయ్యారు. మండల ఎన్నికల అధికారి ఏవీ సుబ్బరాయన్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు గానూ, టీడీపీ నుంచి ఐదుగురు, జనసేన నుంచి నలుగురు ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించడంతో కూటమికి ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులను చేజిక్కించుకోవడం సులభమయ్యింది. ఈ కార్యక్రమానికి ముందు ఎంపీటీసీలు ప్రమాణ స్వీకారం చేశారు.

పోలవరం: ఏలూరు జిల్లా పోలవరం మండల పరిషత్ అధ్యక్షురాలిగా పాదం మంగాదేవి, ఉపాధ్యక్షుడిగా ఎడ్ల పెంటయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే. రవి ప్రసన్నకుమార్ వెల్లడించారు. ఈ ప్రక్రియలో 11 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను పదిమంది హాజరయ్యారు. సమావేశం నిర్వహించి ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీడీవో జి.మణికుమారి మొదటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయిరాజు, ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన ఎంపీటీసీలకు చీఫ్ విప్ జీవీ ఘన సత్కారం

వినుకొండ (చైతన్యరథం): పట్టణం చీఫ్ విప్ వారి కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కూటమి ఎంపీటీసీ సభ్యులను ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గారు ఘనంగా సత్కరించారు. జరగనున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన విధివిధానాలు, వ్యూహాలపై సభ్యులకు పలు కీలక సలహాలు, సూచనలు అందజేశారు. కూటమి సభ్యులంతా ఐక్యంగా, సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు.

టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి నూతన సారథులు..

ఎంపీపీలు, ఎంపీటీసీల పదవీ బాధ్యతలు స్వీకరణ

●నూతన ప్రజాప్రతినిధులకు మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు..

ప్రజాసేవలో అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్ష!

●నాలుగు మండలాల్లో ఎంపీటీసీలు, ఎంపీపీలు పదవీ బాధ్యతలు స్వీకరణ



కోటబొమ్మాళి (చైతన్యరథం): టెక్కలి నియోజకవర్గంలో నాలుగు మండలాల పరిధిలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు) గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసి, నూతన ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టడంతో ఆయా మండలాల్లో స్థానిక సంస్థల పాలనకు కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

నూతన ఎంపీపీలుగా బాధ్యతలు స్వీకరణ

నందిగాం మండలం: పినకాన మోహిణి అజయ్ కుమార్, కోటబొమ్మాళి మండలం: తర్ర రామకృష్ణ, సంతబొమ్మాళి మండలం: సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి,టెక్కలి మండలం: బగాది రమా శేషగిరిరావు, ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 78 ఎంపీటీసీ స్థానాలకు గాను 73 స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. నాలుగు మండలాల పరిధిలో జడ్పీటీసీ స్థానాల్లోనూ అత్యధిక మెజార్టీతో విజయం సాధించింది. నాలుగు మండలాల్లోనూ ఎంపీపీ పదవులను దక్కించుకోవడంతో స్థానిక సంస్థల్లో పార్టీకి స్పష్టమైన ఆధిక్యత లభించింది.

మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వం.. అభివృద్ధికి బాటలు!

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాయకత్వంలో టెక్కలి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా టెక్కలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, రైతులకు సాగునీటి వసతులు, రహదారుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

కార్యకర్తలకు ఆత్మీయత.. నాయకులకు ప్రోత్సాహం.. ప్రజాసేవే లక్ష్యం!

మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలోని ప్రత్యేకత ప్రజలతో ఆయనకున్న అనుబంధం. ప్రతి కార్యకర్తను పేరుపెట్టి ఆప్యాయంగా పలకరిస్తూ, వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, పార్టీ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతనివ్వడం ఆయన ప్రత్యేక శైలి. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి ప్రోత్సహించడం, నాయకులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.

బాధ్యతల స్వీకారం.. అభివృద్ధికి మరో ముందడుగు!

నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేయాల్సిన బాధ్యత ఉంది. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కృషి చేయాలి. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మార్గదర్శకత్వంలో నూతన ప్రజాప్రతినిధులందరూ సమష్టిగా పనిచేస్తూ టెక్కలి నియోజకవర్గ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తారనే ఆకాంక్ష వ్యక్తమవుతోంది. ప్రజలతో అనుబంధం.. కార్యకర్తలకు అండగా నాయకత్వం.. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.. మంత్రి అచ్చెన్నాయుడు నేతృత్వంలో టెక్కలి నియోజకవర్గంలో నూతన ప్రజాప్రతినిధుల బాధ్యతల స్వీకారంతో అభివృద్ధి ప్రస్థానంలో మరో ముందడుగు పడింది.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి



తాళ్లపూడి (చైతన్యరథం): ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎంపీపీగా తాడిపూడికి చెందిన నామా నాగశంకరరాణి (టీడీపీ), వైస్ ఎంపీపీగా పెద్దేవం గ్రామానికి చెందిన కల్లూరి సుబ్రహ్మణ్యం (జనసేన) ఎన్నికయ్యారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన ఎంపీపీ, ఉప ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. ఎంపీపీ నాగశంకరాణి మాట్లాడుతూ.. కూటమి పాలనలో మండలాన్ని అన్నిరంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తామన్నారు.

పేద విద్యార్థిని లండన్ చదువుకు ఆసరాగా నిలిచిన రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు...

● పెద్ద మనసు చాటుకున్న ఎంపీ... కృతజ్ఞతలు తెలిపిన కోనసీమ ముస్లిం మైనార్టీలు



అమలాపురం (చైతన్యరథం): అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఓ పేద ముస్లిం మైనార్టీ విద్యార్థిని ఉన్నత చదువు కోసం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ పెద్ద మనసు చాటుకున్నారు. లండన్‌లో ఎంబీఏ చదువుకోవాలన్న ఆ విద్యార్థిని కలకు తన ఆర్థిక సాయంతో అండగా నిలిచారు. ఎంపీ ఉదార స్వభావం పట్ల కోనసీమ ముస్లిం మైనార్టీ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

వివరాల్లోకి వెళితే... అమలాపురానికి చెందిన మహమ్మద్ రెహనా అనే విద్యార్థిని లండన్‌లో ఎంబీఏ చదవాలని భావించింది. అయితే ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూసింది. ఇటీవల రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన సానా సతీష్ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు ఆహ్వానం మేరకు కోనసీమ విచ్చేశారు. ఈ సందర్భంగా టీడీపీ బూత్ కన్వీనర్ వెంకటేశ్వరరావు ద్వారా రెహనా తన పరిస్థితిని వివరిస్తూ ఎంపీకి వినతిపత్రం అందజేసింది. విద్యార్థిని విజ్ఞప్తి పై ఎంపీ సానా సతీష్ తక్షణమే స్పందించారు. ఉన్నత చదువుల పట్ల ఆమెకున్న ఆసక్తిని గమనించి పూర్తి అండదండలు అందించారు. రెహనా ఎంబీఏ చదువుకు అయ్యే ఖర్చుతో పాటు, లండన్ వెళ్లేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చులన్నీ తానే భరించి ఆమెను విదేశాలకు పంపారు.సకాలంలో స్పందించి పేద విద్యార్థిని జీవితంలో వెలుగులు నింపిన ఎంపీ సానా సతీష్‌కు కోనసీమ ముస్లిం మైనార్టీ నాయకులు, పెద్దలు ఘనంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన వారిలో స్టేట్ వక్ఫ్ బోర్డ్ సభ్యులు హాజీ ముఖరం హుస్సేన్, ప్రముఖ న్యాయవాది మహమ్మద్ అజమ్, ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అధ్యక్షులు మహమ్మద్ బషీర్, టీడీపీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ మిరాన్ షరీఫ్, జనసేన నాయకులు మహమ్మద్ మహబూబ్ షరీఫ్, ఖాదర్ వలీ తదితరులు ఉన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం : ఎమ్మెల్యే నసీర్

● పేదలకు మెరుగైన వైద్య సేవలు అందాలి

● రెండేళ్లలో రూ.100 కోట్లతో జీజీహెచ్ అభివృద్ధి పనులు



గుంటూరు (చైతన్యరథం): పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదు. ప్రతి విభాగంలో పటిష్టమైన వైద్య సేవలు అందాలి. ఆస్పత్రికి వచ్చే పేద రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను ఎమ్మెల్యే నసీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిటీ స్కాన్, ఎంఆర్ఐ, పెట్ స్కాన్, చిన్న పిల్లల వార్డు, జనరల్ వార్డు, ఆర్థోపెడిక్, మాతాశిశు సంరక్షణ విభాగాలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని ఆరా తీశారు. కొన్ని విభాగాల్లో సిబ్బంది సరిగా సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులను పిలిచి మాట్లాడారు. రోగులకు సక్రమమైన సేవలు అందించాలని సూచించారు. ఓపీ విభాగంలో సాధ్యమైన వేగవంతంగా సేవలు అందించాలని చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.100 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆస్పత్రిలో అన్ని విభాగాలను బలోపేతం చేశామని చెప్పారు. క్యాన్సర్ విభాగంలో రూ.25 వేలు విలువైన పెట్ స్కాన్ ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మరో వైపు ఎంఆర్ఐ స్కాన్ తోపాటు ఈఎన్టీ విభాగాల్లో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికే ప్రభుత్వ వైద్యశాల అపర సంజీవనిగా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మందులకు కొరత లేదని చెప్పారు. వైద్యులు రోగాన్ని బట్టి ఏవైనా నూతన మందులు ప్రిస్క్రిప్షన్ ఇస్తే వాటిని మరో పది రోజుల్లో తెప్పించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు పది జిల్లాల నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలను వస్తుంటారని, వారికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రిలో చిన్న చిన్న లోపాలు ఉంటే తమ దృష్టికి ఎప్పుడైనా తీసుకురావచ్చని, వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదు

● పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే గొప్ప ఆశయంతో ఉర్దూ స్టూడెంట్స్ అండ్ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): అరండల్‌పేటలోని ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌లో ఉర్దూ స్టూడెంట్స్ అండ్ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, స్థానిక కార్పొరేటర్ మాచర్ల పావని 30 మంది పేద ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష ఫీజులు, ట్యూషన్ ఫీజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... విద్య అనేది ప్రతి ఒక్కరికీ అందాల్సిన ప్రాథమిక హక్కు అని, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి చదువుకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా సమాజ అభివృద్ధికి సొసైటీ తనవంతు కృషి చేస్తోందని ప్రశంసించారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ... 1996లో స్థాపించబడిన తమ సొసైటీ గత మూడు దశాబ్దాలుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు బహుమతులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు అందిస్తున్నామని వివరించారు. అలాగే పేద విద్యార్థులకు యూనిఫారాలు, బూట్లు, స్కూల్ బ్యాగులు, ఉపకార వేతనాలు అందించడంతో పాటు పాఠశాలలకు బెంచీలు సమకూర్చడం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆటో ఛార్జీల సహాయం, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు, పాఠశాలలకు రంగులు వేయించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు, సొసైటీ కార్యదర్శి, కోశాధికారి ఎస్.కె. కరీముల్లా, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, సభ్యులు ఎస్.కె. నసీమున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాచర్ల గోపి, దొంగర ఆంజనేయులు, అంజాద్, అస్లాం, జావీద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసలు మీకు మనస్సాక్షి అనేది ఉందా? : ఏపీ టీఎస్ అధ్యక్షుడు మన్నవ మోహనకృష్ణ

●కుటుంబ వ్యవహారాలను కూడా రాజకీయ కోణంలో చూస్తూ జుగుప్సాకర రాతలా?



గుంటూరు (చైతన్యరథం): పత్రికా స్వేచ్ఛ పేరుతో మహిళల వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించడం సమంజసం కాదని, రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమే కానీ, వాటి కోసం మహిళల వ్యక్తిత్వాన్ని కించపరచడం సరికాదని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమాజంలో విలువలను పెంపొందించాలి తప్ప, వ్యక్తిగత కక్షలతో మహిళల గౌరవాన్ని దెబ్బతీయకూడదన్నారు. రాజకీయ విమర్శలకు ఒక హద్దు, మీడియా స్వేచ్ఛకు ఒక సామాజిక బాధ్యత ఉంటాయన్నారు. కనీస విలువలు లేకుండా కుటుంబ వ్యవహారాలను కూడా రాజకీయ కక్ష కోణంలో చూస్తూ, జుగుప్సాకరమైన రాతలు రాయించడం ఒక్క జగన్ మోహన్ రెడ్డికి, ఆయన సొంత పత్రిక 'సాక్షి'కి మాత్రమే చెల్లిందని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏపీ కాంగ్రెస్ నాయకురాలు వై.ఎస్ షర్మిల తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిస్తే, దానిపై 'బాబుతో చెట్టపట్టాల్' అంటూ సాక్షి పత్రికలో అత్యంత నీచంగా వార్తలు రాయడం దారుణం. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయాల్లో సమకాలికులు. ఒకప్పుడు మంచి మిత్రులుగా ఉన్నారు, ఇద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. అలాంటి ఒక మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, ప్రస్తుత ముఖ్యమంత్రిని.. అందులోనూ తన తండ్రి లాంటి వ్యక్తిని కలిసి తన కూతురి పెళ్లికి రావాల్సిందిగా ఆహ్వానించడంలో తప్పేముంది? మన తెలుగు సంప్రదాయంలో శుభకార్యాలకు పెద్దలను పిలవడం ఒక గౌరవప్రదమైన ఆచారం. దానిని కూడా ఇంత దుర్మార్గంగా వక్రీకరించి, అసభ్యకరమైన పదజాలంతో రాయించేలా జగన్ మోహన్ రెడ్డి దిగజారిపోవడం సిగ్గుచేటు. అసలు మీకు మనస్సాక్షి అనేది ఉందా? ఒక మహిళ, తన తండ్రి వయసున్న వ్యక్తి వద్దకు వెళ్లి శుభకార్యానికి ఆహ్వానిస్తే ఇంత హీనాతిహీనంగా అవమానిస్తారా? సాక్షి పత్రిక ద్వారా మీరు అవమానించింది కేవలం షర్మిలని మాత్రమే కాదు, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని, యావత్ మహిళా లోకాన్ని అవమానించారు. మహిళల పట్ల గౌరవం లేని ఇలాంటి ప్రవర్తనకు జగన్ మోహన్ రెడ్డి, సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పాల్సిందిపోయి ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు. రాజకీయ అస్తిత్వం కోసం మహిళలను పావులుగా వాడుకోవడం మానుకోవాలని మోహనకృష్ణ సూచించారు.

పాలకొల్లు ఎంపీపీగా అంగర వీరభద్రకుమార్ ఏకగ్రీవ ఎన్నిక

●ఉపాధ్యక్షురాలిగా సాయి లక్ష్మి.. అభినందించిన మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): పాలకొల్లు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా తెలుగుదేశం పార్టీకి చెందిన అంగర వీరభద్రకుమార్ (చిన్న), ఉపాధ్యక్షురాలిగా సాయి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీకి చెందిన 18 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరై అంగర వీరభద్రకుమార్‌ను అధ్యక్షుడిగా, సాయి లక్ష్మిని ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, ఉపాధ్యక్షురాలితో పాటు ఎంపీటీసీ సభ్యులందరూ మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి, తమకు పదవులు దక్కేలా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు నూతన ఎంపీపీ, ఉపాధ్యక్షురాలితో పాటు ఎంపీటీసీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పారదర్శకమైన పాలన అందించాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని హితవు పలికారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. గత రెండున్నరేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.1,275 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరింత కష్టపడి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, ఉపాధ్యక్షురాలు, ఎంపీటీసీ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

గుడివాడ నియోజకవర్గంలో మూడు ఎంపీపీ పీఠాలు టీడీపీ కైవసం

●నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్ ఎంపీపీలుగా సాదం మల్లీశ్వరి, కాగిత ఉమ, వీరవరపు నాగజ్యోతి ఎన్నిక!



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గంలోని మూడు మండల పరిషత్ పీఠాలను టీడీపీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగిన ఎంపీపీ ఎన్నికల ప్రక్రియలో నందివాడ ఎంపీపీగా సాదం మల్లీశ్వరి (టీడీపీ), గుడ్లవల్లేరు ఎంపీపీగా కాగిత ఉమ (టీడీపీ), గుడివాడ రూరల్ ఎంపీపీగా వీరవరపు నాగజ్యోతి (టీడీపీ) లను ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకున్నారు. నిబంధన ప్రకారం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వారు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గుడివాడలోని ప్రజావేదిక కార్యాలయంలో నూతన ఎంపీపీలు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీలను ఎమ్మెల్యే రాము, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు శాలువాలతో సత్కరించి అభినందించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

తదనంతరం నూతన ఎంపీపీలతో ఎమ్మెల్యే రాము, రావి వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా సమావేశమై, పాలనాపరమైన అంశాలపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. నియోజకవర్గం చరిత్రలో ముగ్గురు మహిళలు ఎంపీపీలుగా ఎన్నిక కావడం గొప్ప విషయమన్నారు. గుడివాడ జడ్పీటీసీగా కూడా మహిళా సోదరి ఉండటం, అంతేకాకుండా త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో గుడివాడ చైర్మన్ పీఠంపై కూడా టీడీపీకి చెందిన మహిళా సోదరి అధిరోహించబోతుండటం ఎంతో సంతోషకరమన్నారు. ఇది కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు.

త్రిబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

●స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి చారిత్రాత్మక విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనం

●ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే లక్ష్యంగా ముందుకు సాగుతాం : ఎంపీ కేశినేని



ఎన్టీఆర్ జిల్లా(తిరువూరు) (చైతన్యరథం): తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన చారిత్రాత్మక విజయం ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన సంపూర్ణ విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. పురపాలక సంఘాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అద్భుతమైన విజయాన్ని నమోదు చేశారని, సుమారు 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించడం ప్రజా మద్దతుకు ప్రతిబింబమని అన్నారు.

సమన్వయంతో ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి కృషి

తిరువూరు మున్సిపల్ చైర్మన్ మాధవి, నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీల సమన్వయంతో ఎన్టీఆర్ జిల్లాను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎంపీ తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులు పదవులను బాధ్యతగా భావించి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట.. యువతకు ఉపాధి అవకాశాలు

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు ప్రధాన లక్ష్యాలతో త్రిబుల్ ఇంజిన్ సర్కార్ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందని తెలిపారు.

యువ నాయకత్వానికి ప్రోత్సాహం.. భవిష్యత్తుకు బలమైన పునాది

రాబోయే 25 ఏళ్ల రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎంపీ అభిప్రాయపడ్డారు. నారా లోకేష్, పవన్ కళ్యాణ్ వంటి యువ నాయకత్వం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మహిళా గ్రీవెన్స్

●ప్రతి గురువారం అందుబాటులో ఉంటాం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి గురువారం అందుబాటులో ఉంటూ, మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం (శ్రీనివాసరావుపేట)లో గురువారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎన్డీయే కూటమికి చెందిన నూతన మహిళా కార్పొరేటర్లతో కలిసి మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ప్రతి గురువారం నియోజకవర్గ కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా, నిర్భయంగా వచ్చి చెప్పుకునేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తోందన్నారు. అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఇటీవల ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన నూతన మహిళా కార్పొరేటర్ల సమక్షంలో ఈసారి గ్రీవెన్స్ నిర్వహించడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. మహిళా కార్పొరేటర్లు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మౌలిక వసతుల సమస్యలు, అప్పులు ఇచ్చి మోసపోవడం, దొంగతనాలు, ఉద్యోగ అవకాశాలు, కుటుంబాల్లో వేధింపులు వంటి అనేక సమస్యలతో మహిళలు తమ వద్దకు వస్తున్నారని తెలిపారు.

విమానాశ్రయ నిర్వాసితులకు సమస్యల పరిష్కారం కోసం చిత్త శుద్ధితో పని చేస్తున్నా

●నిర్వాసితుల పరిహారం, పునరావాస సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించా : విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): విమానాశ్రయ విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు రావాల్సిన పరిహారం విషయంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేశాయని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం మండలం బుద్ధవరం గ్రామ సర్పంచి అభ్యర్థి ముద్దరబోయిన శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం దావాజీగూడెం ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు రావాల్సిన పరిహారం కోసం అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించానని తెలిపారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారానికి సంబంధించిన ప్రతిపాదనలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ నిధులు 90 రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పునరావాస ప్యాకేజీ, అద్దె బకాయిలు, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ప్రభుత్వ విప్‌గా బాధ్యతల్లో ఉన్నప్పటికీ నిర్వాసితులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించానని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లానన్నారు. తన హయాంలో 83 మంది నిర్వాసితులకు అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు అందించినట్లు తెలిపారు. బుద్ధవరంలోని సీతారామస్వామి దేవస్థాన భూములను కాపాడటంతోపాటు, దేవస్థానానికి వెలగపూడిలో 6,000 గజాల స్థలం కేటాయించేలా కృషి చేశానన్నారు. ప్రజలు తనకు 32,870కు పైగా ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన లక్ష్యమని చెప్పారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తాను వ్యతిరేకమని, వైసీపీ కార్యకర్తలపై సైతం తప్పుడు కేసులు పెట్టలేదని స్పష్టం చేశారు.

నూతన ఎంపిపి, వైస్ ఎంపిపిలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

జి.కొండూరు (చైతన్యరథం): మండల నూతన ఎంపిపి, వైస్ ఎంపిపిలకు శుభాకాంక్షల తెలిపారు. జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికలో మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆశీస్సులతో ఎంపిపిగా కోడూరు సెగ్మెంట్ ఎంపిటిసి గేరా అనితా, వైస్ ఎంపిపిగా జి.కొండూరు-2 ఎంపిటిసి ఉయ్యూరు అనురాధికను ఎంపిటిసి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ సందర్భంగా నూతన ఎంపిపి, వైస్ ఎంపిపి లను రాష్ట్ర ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉయ్యూరు చంద్రశేఖర్, బెజవాడ హనుమంతరావు, వడ్లమూడి సురేష్ తది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలంటే అధికారం కాదు.. ప్రజాసేవకు సరైన వేదిక అని లోకేశ్ నిరూపించారు. : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): "టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవ వనరులు మరియు ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ రాజకీయ జీవితం ప్రారంభమై 13 ఏళ్లు పూర్తి అవుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. నాయకత్వమంటే కల్లబొల్లి మాటలు కాదు.. కఠోర సాధన, కష్టం, క్రమశిక్షణతో ప్రజల జీవితాల్లో మంచిమార్పు తీసుకురావచ్చని చేతలతో నిరూపించిన ప్రజా నాయకుడు నారా లోకేశ్. అభివృద్ధికి కొత్త అర్థం చెప్పి, ప్రగతి సాధనలో ఏపీకి ప్రత్యేక గుర్తింపునిచ్చి, ప్రపంచ పటంలో నిలిపిన పవర్ ఫుల్ లీడర్ లోకేశ్. యువత మారితే, రాష్ట్రం తద్వారా దేశం మారుతుందని నమ్మి, ఆ దిశగా నవ్యాంధ్రప్రదేశ్ ను పెట్టుబడుల స్వర్గధామంగా మారుస్తున్న ఆయన మేధస్సు, పనితీరు, ఆలోచనా విధానం చూసి తలపండిన రాజకీయ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు. నాయకుడంటే ప్రజల్ని నడిపించేవాడు కాదు.. ప్రజల కలల్ని, ఆశయాల్ని నిజం చేసే నిజమైన సాధకుడని లోకేశ్ తన చేతలతో నిరూపిస్తున్నారు.

రాజకీయాలంటే కేవలం అధికారం కాదు.. ప్రజాసేవకు సరైన వేదిక అనేందుకు లోకేశ్ రాజకీయ ప్రయాణమే నిలువెత్తు నిదర్శనం.. దూరదృష్టి, అనుభవం, నిబద్ధత ఉన్న నాయకుడు రాష్ట్ర భవిష్యత్ ను మార్చగలడని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరూపిస్తుంటే, సంకల్పం, సమయస్ఫూర్తి, సరైన ఆలోచనా విధానంతో యువత కలల్ని నిజం చేయవచ్చని లోకేశ్ నిరూపిస్తున్నారు. రాష్ట్ర యువత, విద్యార్థులు ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎదురుచూడకూడదు.. అవకాశాలు సృష్టించే జెన్ జీగా మార్చాలన్న లోకేశ్ లక్ష్యసాధనలో ఆయనతో కలిసి ముందుకు నడుస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నాను." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.



కావలిలో హోరెత్తుతున్న కూటమి ప్రచారం

ముఖ్య అతిథిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు

నెల్లూరు (చైతన్యరథం): కావలి పట్టణంలో ఎన్డీయే కూటమి మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేసింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ బలపరిచిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి భరత్ కుమార్‌తో పాటు 44 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల పరిచయ వేదిక కార్యక్రమం కావలిలో నిర్వహించారు.కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని దొడ్ల మనోహర్ రెడ్డి నారాయణ కల్యాణ మండపంలో ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు ఎన్నికల పరిశీలకులు డూండి రాకేష్, నెల్లూరు జోన్ ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్ రెడ్డి, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ రాయపాటి డేవిడ్ విల్సన్, నెల్లూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు కందుకూరు సత్యనారాయణ, జనసేన నాయకులు మన్నెమాల సుకుమార్ రెడ్డి ఈ వేదికపై పాల్గొన్నారు. మూడు పార్టీల రాష్ట్ర, జిల్లా నేతలు, అభ్యర్థులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమష్టి కృషితో విజయ దుందుభి మోగిద్దాం

మంత్రి ఆనంను కలిసిన నెల్లూరు టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు

నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో, నెల్లూరు సంతపేటలోని వారి నివాసంలో, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లాలో జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, జరిగిన మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి పార్టీలు సాధించిన ఘన విజయాలు గురించి చర్చించారు. అదేవిధంగా జరగనున్న నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల గురించి మంత్రితో చర్చించారు.



మార్కాపురం ఎంపీపీగా కాగుటూరి కాశమ్మ

మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) మార్కాపురం గ్రామీణం కాగుటూరి కాశమ్మ (తెదేపా), ఉపాధ్యక్షుడిగా ఏరువ రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి డి.రవి ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి బాల చెన్నయ్యల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. అంతకుముందు ఎంపీటీసీల ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది.

సుగవాసికి శుభాకాంక్షల వెల్లువ

కూటమి శ్రేణుల రాకతో సందడే సందడి

రాయచోటి (చైతన్యరథం): రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబును మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా కుమారుడు మహమ్మద్ జూనైద్ అక్బరీ ఆధ్వర్యంలో మదనపల్లి ఎంపీపీ గురునాథ యాదవ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, రామసముద్రం వైస్ ఎంపీపీ రూపేష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబుకు గజమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

గాలివీడు జడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు కూడా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. పదవులు బాధ్యతకు ప్రతీకలు... ప్రజల నమ్మకమే అసలైన బలం! కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర గౌరవం, ఆత్మీయత, ఐక్యతను చాటిన ఈ కలయిక ఆనందోత్సాహాల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కొనకనమిట్ల మండలంలోని కొనకనమెట్ల గ్రామంలో మండల కార్యాలయంలో ఎంపీపీగా కోలా శాంతమ్మ, వైస్ ఎంపీపీగా మూలే చెన్నారెడ్డి ఎంపీటీసీల ప్రమాణ స్వీకారోత్సవానికి మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి విచ్చేసి విజేతలందరికీ పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేశారు.





మర్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి పొదిలి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కడు తమ శక్తి వంచన లేకుండా కష్టపడి వచ్చే పొదిలి నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి చైర్మన్ అభ్యర్థిని, వార్డు సభ్యులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైసీపీని వీడి టీడీపీలోకి భారీగా చేరికలు

కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం బీచిగానిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాలాజీ ఆధ్వర్యంలో సుమారు 15 కుటుంబాలు బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పరిటాల ఇలాకాలో కూటమి క్లీన్‌స్వీప్



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఆరు మండలాల్లోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఏకపక్షంగా ఘన విజయం సాధించి క్లీన్‌స్వీప్ చేశారు. ఎక్కడా ఎలాంటి చిన్నపాటి అవాంఛనీయ ఘటనలు కూడా చోటుచేసుకోకుండా, పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలు జరిగింది. ఎన్నికల ప్రక్రియకు ముందు ఉదయం వెంకటాపురంలోని తన నివాసంలో రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మండల ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించే ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం, అనంతరం జరిగే ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నికల విధివిధానాలపై వారికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం అనంతరం ఎంపీటీసీ సభ్యులందరూ కలిసి పరిటాల రవీంద్ర ఘాట్‌ను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి నాయకులు, కార్యకర్తల కోలాహలం నడుమ ఆయా మండల కేంద్రాలకు బయలుదేరి వెళ్లి ప్రమాణ స్వీకారోత్సవాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలకవర్గాల వివరాలను పరిశీలిస్తే.. ఆత్మకూరు మండల ఎంపీపీగా మదిగుబ్బ మల్లికార్జున రెడ్డి, వైస్ ఎంపీపీగా ముట్టాల బోయ గీతారాణి ఎన్నికై బాధ్యతలు స్వీకరించగా, అనంతపురం రూరల్ మండల ఎంపీపీగా చల్లా జయకృష్ణ, వైస్ ఎంపీపీగా అనంతపురం అర్బన్ నుంచి ఉదయ శంకర్ ఎన్నికయ్యారు. అలాగే రాప్తాడు మండల ఎంపీపీగా దగ్గుబాటి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీగా తలారి బోయ శివయ్య ప్రమాణ స్వీకారం చేయగా, కనగానపల్లి మండల ఎంపీపీగా యాతం పోతలయ్య, వైస్ ఎంపీపీగా శివపురం కురుబ ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఇక చెన్నేకొత్తపల్లి మండల ఎంపీపీగా దండు ఓబులేసు, వైస్ ఎంపీపీగా బోయ శీలం ఫణింద్ర బాధ్యతలు చేపట్టగా, రామగిరి మండల ఎంపీపీగా కురుబ సుధాకర్, వైస్ ఎంపీపీగా పోలేపల్లి తిమ్మానాయుడు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఇలా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ టీడీపీ అభ్యర్థులే ఎంపీపీ, వైస్ ఎంపీపీ పీఠాలను కైవసం చేసుకోవడంతో పార్టీ శ్రేణుల్లో సంబరాలు మిన్నంటాయి. రామగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు మరియు ఎంపీటీసీ సభ్యులను ఆమె శాలువాలతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఎంతో నమ్మకం ఉంచి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ అఖండ విజయాన్ని అందించారన్నారు. ఈ విజయం మనపై బాధ్యతను మరింత పెంచిందని, నూతన ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మంచి పాలన అందించాలని ఆమె దిశానిర్దేశం చేశారు..



సాక్షి ఛానల్, వైసీపీ నేతల దుష్ప్రచారం

పులివెందులలో టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి

పులివెందుల (చైతన్యరథం): 21 మందికి రక్షణ, కేంద్రాల మార్పుపై వైసీపీ పిటిషన్.. (1+2) ఎస్కార్ట్‌కు హైకోర్టు ఆదేశం జారీ చేసిందని పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీ టెక్ రవి తెలిపారు. రాత్రి 8 గంటలకు కోర్టు ఆర్డర్ వస్తే.. సాయంత్రం 5కే 13 మంది రక్షణ లేకుండా నామినేషన్లు వేశారన్నారు. కోర్టు, ఎన్నికల సంఘాన్ని వైసీపీ తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. 307 కేసు నిందితులను ఎంపీ అవినాష్ రెడ్డి వెనకేసుకొస్తున్నారన్నారు. అది సీసీ కెమెరాల్లో కూడా రికార్డయిందన్నారు. చక్రాయపేటలో 300 మంది వైసీపీ కార్యకర్తల హల్‌చల్ చేశారనాఁ. ట్రాక్టర్ ఎక్కించి టీడీపీ కార్యకర్తలు గాయ పరిచారన్నారు. ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పోలీసులు ఇంకా అదుపులోకి తీసుకోలేదన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పుడు వందలాది మందితో రావడం ఏంటి.. పులివెందుల, వేంపల్లిలో నామినేషన్లు సజావుగా జరిగాయని తెలిపారు.

అక్షరాంధ్ర విజయవంతం కావాలి

కర్నూలు (చైతన్యరథం): జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డా.ఏ. సిరి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అక్షరాంధ్ర కార్యక్రమం రెండో దశ కొనసాగుతోంది. ఈ దశలో కర్నూలు జిల్లాలో 1,89,571 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అక్షరాస్యత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అక్షరాంధ్ర కార్యక్రమం మూడో దశను ఏప్రిల్ 2027 నుంచి సెప్టెంబరు వరకు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ దశలో మిగిలిన నిరక్షరాస్యులందరినీ గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం. 2027 సెప్టెంబరులో అక్షరాస్యత మూల్యాంకన పరీక్ష నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అధికారులను ఉద్దేశించి క్షేత్రస్థాయిలో అర్హులైన నిరక్షరాస్యులను గుర్తించి వలంటీర్లతో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. అక్షరాంధ్ర యాప్‌లో నమోదు డేటా వెరిఫికేషన్, మ్యాపింగ్ ప్రక్రియను 2026 నవంబరు 25లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో ప్రతి నిరక్షరాస్యుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



ఈవీఎంలైనా, బ్యాలెట్లయినా ప్రజాతీర్పు కూటమి వైపే!

విలేఖరుల సమావేశంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడి

అనంతపురము (చైతన్యరథం): బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, జనసేన నగర అధ్యక్షుడు బాబురావుతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రెస్ మీట్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి వన్ సైడ్ విక్టరీ సాధించిందని ఆయన అన్నారు. 95 శాతానికి పైగా స్థానిక సంస్థల్లో కూటమి విజయదుందుభి మోగించిందన్నారు. జిల్లాలో గొడ్డలి పార్టీకి జెడ్పీ ఎన్నికల్లో కేవలం 2 స్థానాలే వచ్చాయని వివరించారు. అనంతపురంలో 41 డివిజన్లు, 9 ఎంపీటీసీ స్థానాల్లో విజయాన్నిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడం వల్లే వైసీపీ మేయర్ అభ్యర్థి గెలిచారన్నారు. గత ప్రభుత్వంలా అక్రమాలకు పాల్పడి ఉంటే మేయర్ పీఠం కూడా తమకే దక్కేదన్నారు. మేయర్ ఎన్నికలో జరిగిన చిన్న చిన్న తప్పిదాలను సరిదిద్దుకుని ముందుకెళ్తామన్నారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా పోటీ చేసి క్లీన్ స్వీప్ చేస్తాయనిధీమా వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్న చోటే గొడవలు జరిగాయన్నారు. ఎన్నికలను ఆపాలని కుట్ర చేశారని ఆరోపించారు. పార్టీ పరంగా బీసీలకు 40 శాతం రిజర్వేషన్ కల్పించి కూటమి సామాజిక న్యాయం చేసిందని వివరించారు. సీఎం చంద్రబాబు విజన్, నారా లోకేష్ కార్యాచరణతో సీఐఐ సదస్సులో రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా 25లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను సీఎం చంద్రబాబు తిరిగి నిలబెట్టారని కొనియాడారు. హంద్రీనీవా కాలువ వెడల్పు, 'రైజింగ్ రాయలసీమ' ద్వారా ఈ ప్రాంతాన్ని హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ వల్ల సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అర్హులందరికీ వేగంగా అందుతున్నాయన్నారు. తుపాను కంటే వేగంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేసి విపత్తుల నష్టాన్ని నివారించిందన్నారు. కలిసికట్టుగా పని చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పేర్కొన్నారు. ఊహించని స్థానాలు గెలుచుకున్నామని జనసేన నగరాధ్యక్షుడు బాబురావు సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లోనూ సమన్వయంతో ముందుకెళ్తామని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు.



భారత కాన్సుల్ జనరల్‌తో ఎన్ఆర్ఐ టీడీపీ నేతల భేటీ

ఓసీఐ, పాస్‌పోర్టు సేవలపై చర్చ

సెయింట్ లూయిస్, మిస్సోరి: అమెరికాలోని మిస్సోరి రాష్ట్రం సెయింట్ లూయిస్‌లో వివిధ భారతీయ కమ్యూనిటీ సంస్థల ప్రతినిధులు, ఎన్నారై టీడీపీ నాయకులు చికాగోలోని భారత కాన్సుల్ జనరల్ డాక్టర్ ఎం.ఆనంద్‌ప్రకాష్ (ఐఎఫ్ఎస్)తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రవాస భారతీయులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, కాన్సులర్ సేవలపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయ పౌరులు, భారత సంతతి కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ముఖ్య అంశాలపై ప్రతినిధులు కాన్సుల్ జనరల్ దృష్టి సారించారు. ముఖ్యంగా ఓసీఐ (ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా) కార్డు సేవలు, పాస్‌పోర్టు పునరుద్ధరణ, కాన్సులర్ సహాయం, అత్యవసర సేవల అందుబాటు తదితర అంశాలపై చర్చ జరిగింది. కమ్యూనిటీ నాయకులు తమ సమస్యలను వివరించడంతో పాటు భారత కాన్సులేట్, స్థానిక భారతీయ సంస్థల మధ్య సమాచార మార్పిడి, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఎన్నారై టీడీపీ గ్లోబల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచు వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎన్నారై, టీడీపీ సెయింట్ లూయిస్ అధ్యక్షుడు కిషోర్ యార్లగడ్డ సహా పలువురు ఎన్నారై టీడీపీ సభ్యులు పాల్గొన్నారు. తానా ట్రస్టీ రాజా సూరపనేని, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సెయింట్ లూయిస్ అధ్యక్షుడు, బోర్డు డైరెక్టర్లు, ప్రతినిధులు, టీఏఎస్ అధ్యక్షుడు కిషోర్ యరపోతిన, తానా రీజినల్ కో-ఆర్డినేటర్ రవి పొట్లూరి హాజరయ్యారు. వారితో పాటు తమిళ సంగం, గుజరాతీ, కర్ణాటక కమ్యూనిటీ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొనడం సెయింట్ లూయిస్ ప్రాంతంలోని భారతీయ సమాజం ఐక్యతకు, వైవిధ్యానికి అద్దంపట్టింది. తమ సమస్యలను ఓపికగా విని, కాన్సులర్ సేవలు, కమ్యూనిటీ సంక్షేమంపై విలువైన సూచనలు అందించినందుకు డాక్టర్ ఆనంద్ ప్రకాష్‌కు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. భారత కాన్సులేట్, ప్రవాస భారతీయుల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి, కాన్సులర్ సేవలను సులభతరం చేయడానికి ఇరువైపులా ఉమ్మడి నిబద్ధత వ్యక్తమైంది.





డల్లాస్‌లో 'సండే సత్సంగ్'

డల్లాస్: రాధాకృష్ణ టెంపుల్ ఆఫ్ డల్లాస్ ఆధ్వర్యంలో భక్తుల ఆధ్యాత్మిక ప్రశాంతత, మానసిక ఉల్లాసం కోసం 'సండే సత్సంగ్' నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 'సాధువులతో, సత్యంతో నిరంతరం సహవాసం చేయడం వల్ల హృదయం శుద్ధి చెందుతుంది, ఆత్మ ఉన్నత స్థితికి చేరుకుంటుంది' అని స్వామి ముకుందానంద సందేశమిచ్చారు. భారతీయ ధర్మంలో సత్సంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తిభావం, కీర్తనలు, దివ్య జ్ఞానంతో ఆధ్యాత్మికంగా ఉత్తేజపరిచే ఈ ఆదివారం సత్సంగ్‌లో భక్తులందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సత్సంగ్‌లో ప్రత్యక్ష దర్శనం, దివ్య కీర్తనలు, ధ్యానం, స్వామీజీ ప్రవచనం, హారతి ఉంటాయి. భక్తులు నేరుగా ఆలయానికి విచ్చేసి ప్రత్యక్షంగా తిలకించవచ్చు. రాలేని వారు యూట్యూబ్ లైవ్ ద్వారా, భగవద్గీత కృష్ణ భక్తి యాప్ (Bhagavad Gita Krishna Bhakti App) ద్వారా ఇంటి నుంచే వీక్షించవచ్చని ఆలయ కమిటీ తెలిపింది.



తానా ఆధ్వర్యంలో డిసెంబరు 6న

'శివ-శంభో స్వయంభో' లైవ్ స్పెక్టాకిల్



వర్జీనియా: నిరంతరం సామాజిక, సేవా కార్యక్రమాలతో ముందుండే ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) తాజాగా ఓ వినూత్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అమెరికాలోని వర్జీనియాలో 'శివ-శంభో స్వయంభో' పేరిట అంగరంగ వైభవంగా లైవ్ స్పెక్టాకిల్ (ప్రత్యక్ష దృశ్య కావ్యం) నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. సంగీతం, నృత్యం, నాటకం, అత్యద్భుతమైన రంగస్థల కళల (స్టేజ్ క్రాఫ్ట్) మేళవింపుతో రూపొందిన ఈ ప్రత్యక్ష ప్రదర్శన డిసెంబరు 6వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. వర్జీనియా రాష్ట్రం ఆల్డీ నగరంలోని విల్లార్డ్ మిడిల్ స్కూల్ (40915 బ్రాడాక్ రోడ్, ఆల్డీ, VA 20105) ఇందుకు వేదిక కానుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ కార్యక్రమాన్ని 'కళా వేదిక' ప్రొడ్యూస్ చేస్తుండగా 'నాట్యమార్గం-ఇంద్రాణి' సంస్థ సహకారం అందిస్తోంది. ఈ ప్రదర్శనకు ఇంద్రాణి మహాదేవ దర్శకత్వం వహిస్తుండగా వర్షిణి క్రియేటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. పరమశివుని దివ్య గాథలను, ఆధ్యాత్మిక సారాన్ని సజీవంగా ఆవిష్కరిస్తూ ప్రేక్షకులకు శివుని శక్తి, భక్తి, వైభవాలను అనుభూతి చెందేలా ఈ దృశ్య కావ్యాన్ని తీర్చిదిద్దారు. తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, కల్చరల్ కో-ఆర్డినేటర్ సాయిసుధ పాలడుగు నేతృత్వంలోని తానా లీడర్‌షిప్ బృందం (సుధీర్ కొమ్మి, సాయి బొల్లినేని, శ్రీనివాస్ కుకట్ల, జనార్దన్ నిమ్మలపూడి, అనిల్ ఉప్పలపాటి, త్రిలోక్ కాంతేటి) ఈ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శివభక్తి తత్వంతో, అద్భుత కళారూపాలతో సాగే ఈ దృశ్య కావ్యాన్ని ఆస్వాదించేందుకు ప్రవాస తెలుగువారందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

శాన్‌ఫ్రాన్సిస్కో శ్రీస్వామినారాయణ ఆలయంలో

'పాటోత్సవ్'

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో గల శ్రీస్వామినారాయణ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 14వ పాటోత్సవ్ వేడుకలకు సంబంధించిన అధికారిక లోగోను ఘనంగా ఆవిష్కరించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ పవిత్ర మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు, వేడుకల వివరాలను ఈ లోగో లాంచ్ ద్వారా అధికారికంగా ప్రకటించారు.



భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. పాటోత్సవ్ అనేది ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్ర వేడుక. ఇస్కాన్ దేవాలయాల్లో భగవంతుని విగ్రహాలను సింహాసనంపై (పాట్) ప్రతిష్ఠించిన రోజును స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం దీనిని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఈ రోజున మూలవిరాట్టులకు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తారు.



దుబాయ్ బీచ్‌లో భారతీయుల

ఛఠ్ పూజ

దుబాయ్: విదేశాల్లో ఉన్నా భారతీయులు తమ సంప్రదాయాన్ని ఏమాత్రం మరవలేదు. దుబాయ్‌లోని అల్ ముజ్ర్ బీచ్‌లో ఛఠ్ పూజను ఘనంగా జరుపుకున్నారు. వివిధ వయసులకు చెందిన భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి బీచ్ వద్దకు చేరుకున్నారు. వెదురు బుట్టలు, పండ్లు, పూజా సామగ్రితో మహిళలు సముద్రపు నీటిలో నిలబడి సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పించారు. కొందరు భక్తులు సముద్రంలో పాలు కూడా పోశారు. ప్రవాస భారతీయురాలు రాజ్ ఈ వేడుకలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



ఇష్టారీతి కాలక్షేపం మన సంస్కృతి కాదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



ప్రస్తుత తరుణంలో ప్రజలు ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ గురువారం తెలిపారు. ఇష్టారీతిన కాలం గడపడం భారతీయ సంస్కృతి కాదని చెప్పారు. న్యూఢిల్లీలో నేడు జరిగిన కేంద్ర మంత్రి మండలి సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. గత కొన్నేళ్లల్లో ఎంతో మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు. ప్రజలు పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే మళ్లీ పేదరికంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 2011 నుంచి 2023 మధ్య కాలంలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని పేర్కొన్నారు. ఈ సందర్భం జాతీయస్థాయి వేడుకలకు అర్హమైనదని వ్యాఖ్యానించారు. పేదరికాన్ని తగ్గించడమనేది భారత్ ఎదుర్కొంటున్న సవాలులో ఓ భాగం మాత్రమే అని ప్రధాని అభిప్రాయపడ్డారు. వీరంతా మళ్లీ పేదరికంలోకి జారిపోకుండా మరింత కృషి జరగాల్సి ఉందని చెప్పారు. 2014లో పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో తాను చేసిన ప్రసంగాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పేదల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అంకితమైందని తాను అప్పట్లో అన్నానని తెలిపారు. ఈ దిశగా తీసుకున్న చర్యలు దేశాన్ని అభివృద్ధివైపు నడిపించాయని చెప్పారు. ఈ సమావేశంలో డ్రగ్స్ సమస్య, అంతర్గత భద్రతకు సంబంధించి అంశాలపై కూడా చర్చ జరిగింది. ఈ సందర్భంగా డ్రగ్స్ సమస్య గురించి మాట్లాడే సమయంలో ప్రధాని మోదీ భావోద్వేగానికి గురైనట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ సమస్యను మూలాల నుంచి తుడిచిపెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం సమిష్టి కృషి అవసరమని అన్నారు. నక్సలిజం విషయంలో నిర్లక్ష్యం వద్దని కూడా సహచర మంత్రులు, అధికారులను ప్రధాని అప్రమత్తం చేశారు.



బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

కాలువలోకి దూసుకెళ్లిన స్కార్పియో : ఆరుగురు మృతి

బీహార్‌లోని అరేరియా జిల్లాలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తారాబారి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీడీ వంతెన సమీపంలో వేగంగా వెళ్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్నవారు తేరుకునేలోపే వాహనం కాలువలో పడిపోయినట్లు సమాచారం. మృతులంతా సుపాల్ జిల్లాకు చెందినవారిగా తెలుస్తోంది. వీరంతా ఓ పెళ్లి వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాలువలో పడిపోయిన వాహనం నుంచి బాధితులను బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఆరుగురి మృతితో బాధిత కుటుంబాల్లో విషాదం నెలకొంది. ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్త ప్రియురాలి హత్యకు రూ. 13 లక్షల సుపారీ

మహారాష్ట్ర విమానయాన సంస్థ ఉద్యోగిని హత్యకేసు



మహారాష్ట్రలోని గోండియాలో విమానయాన సంస్థ ఉద్యోగిని వర్షా తుర్కర్ (35) హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో అతడి భార్య మోనా అగర్వాల్ (41) ఈ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వర్షా తుర్కర్ నవంబర్ 14న తన స్నేహితుడు నితేష్ అగర్వాల్‌తో కలిసి బయటకు వెళ్లగా.. తిరుగు ప్రయాణంలో బోండ్రాని గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆగారు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు వర్షాపై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ కేసును ఛేదించేందుకు రంగంలోకి దిగిన పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. సుమారు 200 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుల కుట్రను గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. మోనా అగర్వాల్ తన భర్తకు వర్షాతో ఉన్న సంబంధాన్ని సహించలేక కునాల్ కుంభల్కర్ సహాయంతో హత్యకు పథకం వేసింది. అనంతరం షారుఖ్ పఠాన్ ద్వారా రూ.13 లక్షలకు సుపారీ కుదిర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కుట్రలో భాగంగా ముగ్గురు దుండగులు నితేష్ కారును వెంబడించి, వర్షాను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో మోనా అగర్వాల్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను ఓడించిన

టీవీకే ఎమ్మెల్యే బీఎస్ బాబు మృతి



డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కొళత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓడించిన టీవీకే ఎమ్మెల్యే బీఎస్ బాబు (75) కన్నుమూశారు. శ్వాసకోశ వ్యాధులతో దీర్ఘకాలంగా బాధపడుతున్న ఆయన కార్డియాక్ అరెస్టుతో గురువారం మధ్యాహ్నం 2.24 గంటలకు చెన్నైలోని ఎంజీఎం ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఎంజీఎం ఆసుపత్రి ఒక బులెటిన్‌లో వెల్లడించింది. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న ఎమ్మెల్యేను ఆయన కుటుంబ సభ్యులు ఈ ఏడాది సెప్టెంబరు 9న ఎంజీఎంలో అడ్మిట్ చేయించారు. చికిత్స తీసుకుంటుండగా గురువారం మధ్యాహ్నం 2.14 గంటలకు ఆయన కార్డియాక్ అరెస్టుకు గురయ్యారని, 2.24 గంటలకు ప్రాణాలు కోల్పోయారని ఎంజీఎం వైద్యులు తెలిపారు. ఆయనను కాపాడేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశామని, అయినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని వెల్లడించారు. ఆయనకు చికిత్స అందిస్తున్న క్రమంలోనే కార్డియాక్ అరెస్టుకు గురయ్యారని వివరించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని ఎంజీఎం యాజమాన్యం ప్రకటించింది.

అయోధ్య నుంచి అఖిలేశ్‌పై పోటీకి సిద్ధం

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రతి సవాల్

అయోధ్య నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలంటూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ విసిరిన సవాల్‌పై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘాటుగా స్పందించారు. అఖిలేష్ యాదవ్ అయోధ్య నుంచి నామినేషన్ దాఖలు చేస్తే, తాను కూడా అక్కడి నుంచే పోటీ చేస్తానని బహిరంగ సవాల్ విసిరారు. గురువారం (నవంబర్ 19) గోరఖ్‌పూర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ సమాజ్‌వాదీ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

అయోధ్యలో ముఖాముఖీ పోరుకు సిద్ధం

అయోధ్య నుంచి ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో అఖిలేష్ యాదవ్ చేసిన వ్యాఖ్యలకు యోగి కౌంటర్ ఇచ్చారు. 'మీరు అక్కడి నుంచి నామినేషన్ దాఖలు చేస్తే, నేను కూడా నామినేషన్ వేస్తాను. ముఖాముఖిగా, నేరుగా పోటీ ఎలా ఉంటుందో చూద్దాం' అని యోగి అన్నారు. అఖిలేష్ యాదవ్‌కు ఎదురుగా నిలబడి పోరాడే ధైర్యం లేదని, బలహీనమైన వ్యక్తి ఎప్పుడూ వెనుక నుంచే దాడి చేస్తాడని సీఎం ఎద్దేవా చేశారు.

సమాజ్‌వాదీ పార్టీ మాఫియా శక్తులపై ఆధారపడి రాజకీయాలు చేస్తోందని యోగి ఆరోపించారు. గతంలో ఆ పార్టీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలను అడ్డుకున్నారని, రాష్ట్రంలో మహిళలు, వ్యాపారుల భద్రతను ప్రమాదంలోకి నెట్టారని మండిపడ్డారు. 'సమాజ్‌వాదీ పార్టీ అంటేనే గూండాయిజం, అరాచకం, అల్లర్లు, కర్ఫ్యూలకు పర్యాయపదం. ప్రతి మాఫియా వారి మిత్రపక్షమే, వారు ఎల్లప్పుడూ ప్రజలను మోసం చేశారు' అని విమర్శించారు.

మాఫియాపై ఉక్కుపాదం మోపుతాం

రాష్ట్రంలో నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని యోగి ఆదిత్యనాథ్ హెచ్చరించారు. 'ఎవరైనా మాఫియాగిరీకి పాల్పడాలని ప్రయత్నిస్తే, ఆ మాఫియాను మట్టిలో కలిపేయడానికి ఎక్కువ సమయం పట్టదు. కుక్క తోక ఎప్పటికీ వంకరగానే ఉన్నట్లు, ఈ గూండాలు, మాఫియాలు చట్టబద్ధంగా కఠిన చర్యలు తీసుకుంటే తప్ప మారరు. మా ప్రభుత్వం సరిగ్గా అదే చేస్తోంది. ఇప్పటికే వారి ఆగడాలను అరికట్టాము, మళ్లీ వారిపై ఉచ్చు బిగించేందుకు సిద్ధమవుతున్నాము' అని సీఎం స్పష్టం చేశారు.





ముగ్గురు అగనేతల మేలు కలయిక

తొలి త్రైపాక్షిక సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్

షెన్‌జెన్ వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత షీ జిన్‌పింగ్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌ల సమావేశం ప్రారంభమైంది. గ్లోబల్ పవర్స్‌గా పేరుపడ్డ ఈ దేశాల మధ్య జరుగుతున్న తొలి త్రైపాక్షిక సమావేశం ఇది. తాము కలిసి చర్చలకు కూర్చుకోవడం ఇదే తొలిసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మీటింగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు. భేదాభిప్రాయాలు ఉన్న దేశాలతో నేరుగా చర్చలు జరిపేలా కొత్త విదేశాంగ విధానాన్ని అనుసరిస్తున్నామని ట్రంప్ తెలిపారు.

ఉక్రెయిన్‌తో అందరి ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి: పుతిన్

రష్యా, చైనా, అమెరికా మధ్య సహకారం పెరిగితే అది ప్రపంచ భద్రతకు ప్రయోజనం చేకూరుస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. అయితే, ఈ దిశగా మూడు దేశాలు నిర్మాణాత్మక కృషి చేస్తే ఇదంతా సాధ్యమవుతుందని చెప్పారు. ప్రపంచంలో శాంతిస్థాపనలో అర్థవంతమైన పాత్రపోషించాలని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారంతో అందరికీ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

మనకు ఆ సంకోచం వద్దు: ట్రంప్

'మూడు అతిపెద్ద దేశాల అధినేతలుగా పారదర్శకమైన, గౌరవప్రదమైన, నిర్మాణాత్మకమైన చర్చలు జరపాల్సిన బాధ్యత మనపై ఉంది.

యావత్ ప్రపంచంపైనా ప్రభావం చూపే అంశాల విషయంలో నిర్మాణాత్మకంగా ఉండాలి. విభేదాలు ఉన్న దేశాలతో నేరుగా చర్చలు జరిపేందుకు గత పాలకులు సంకోచించేవారు. కానీ మన ఆలోచన భిన్నమైనది' అని అన్నారు. పరస్పర సహకారానికి, చర్చలకు ఉన్న అవకాశాలు కాదనుకున్నాక శాంతి స్థాపన సాధ్యం కాదని కూడా ట్రంప్ అన్నారు.

పరస్పర సహకారం ఉండాలి: షీ జిన్‌పింగ్

మూడు దేశాల మధ్య సహకారం పెరగాలని చైనా అధినేత జిన్‌పింగ్ కూడా అన్నారు. గ్లోబల్ శక్తుల మధ్య సానుకూల వాతావరణం తప్పనిసరి అని అన్నారు. ప్రపంచమే ఓ గ్రామంగా మారిపోయిందని అన్నారు. అందరి జీవితాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని చెప్పారు. మానవాళి పట్ల శక్తిమంతమైన దేశాలకు ప్రత్యేక బాధ్యత ఉందని కూడా చైనా అధినేత వ్యాఖ్యానించారు. రష్యాతో తమకు ప్రత్యేక బంధం ఉందని అన్నారు. అమెరికాతో కూడా స్థిరమైన దౌత్యబంధం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. షెన్‌జెన్‌లోని కైలిన్ విల్లాలో ఈ సమావేశం జరుగుతోంది. మీటింగ్‌కు మునుపు ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్‌లు కలిసి ఫొటో దిగారు.

భారతీయులకు ఉచిత వీసా... రద్దు చేసిన మలేషియా...!



భారతీయులకు గతంలో ఇచ్చిన వీసా ఫ్రీ ఎంట్రీ సదుపాయాన్ని జనవరి నుంచీ మలేషియా రద్దు చేయనుంది. ఆ తరువాత మలేషియా వెళ్లాలనుకునే భారతీయులు ముందుగానే వీసా పొందాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని మలేషియా ఇమిగ్రేషన్ శాఖ తాజాగా వెల్లడించింది.

వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మలేషియాకు రావాలనుకునే వారు వీసాను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించింది. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను మైవీసా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా భారతీయులు డిసెంబర్ 1 నుంచి సమర్పించవచ్చు. కొవిడ్-19 తరువాత దేశంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు మలేషియా వీసా ఫ్రీ ఎంట్రీ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో, క్రమంగా భారతీయ పర్యాటకుల సంఖ్య పెరిగింది. అయితే, ఈ వ్యవస్థ దుర్వినియోగం అవుతోందని భారత్‌లోని మలేషియా హైకమిషన్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. టూరిస్టు వీసాల ద్వారా మలేషియాకు వెళుతున్న అనేక మంది అక్కడ ఉపాధి వెతుక్కుంటున్నారని పేర్కొంది. అక్రమ ఏజెంట్ల బారిన పడి కొందరు మలేషియాలో చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని చెప్పింది. ఇదిలా ఉంటే వీసా దరఖాస్తులకు సంబంధించి కొత్త నిబంధనను కూడా మలేషియా తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఒక దరఖాస్తు 7 పని దినాలకు మించి పెండింగ్ లేదా న్యూ అప్లికేషన్ దశలోనే ఉంటే అది ఆటోమేటిక్‌గా రద్దైపోతుందని తెలిపింది. ఇది గత నెలలోనే అమల్లోకి వచ్చింది.

బంగ్లాదేశ్‌లో హింసాత్మకంగా రాజకీయ ఉద్రిక్తతలు

బంగ్లాదేశ్‌లో రాజకీయ ఉద్రిక్తతలు మరోసారి హింసాత్మకంగా మారాయి. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మాజీ తాత్కాలిక ప్రభుత్వ అధిపతి మహమ్మద్ యూనస్‌కు చెందిన పూర్వీకుల ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆయన స్థాపించిన గ్రామీణ్ బ్యాంక్ కార్యాలయాలపైనా వరుస దాడులు జరిగాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ దేశవ్యాప్త లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో పేలుళ్లు, అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోని చట్టోగ్రామ్ నగరంలోని పంచలైష్ ప్రాంతంలో మహమ్మద్ యూనస్ కుటుంబానికి చెందిన పూర్వీకుల ఇంటికి బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనకు కారణమైన వ్యక్తులెవరనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముందుజాగ్రత్తగా ఇంటి వద్ద భద్రతను పెంచారు. మహమ్మద్ యూనస్ స్థాపించిన గ్రామీణ్ బ్యాంక్ కార్యాలయాలను కూడా దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో బ్యాంక్ శాఖలకు నిప్పు పెట్టడం, విధ్వంసానికి పాల్పడటం వంటి ఘటనలు నమోదయ్యాయి. నవంబర్ 10 నుంచి ఇప్పటివరకు కనీసం 37 గ్రామీణ్ బ్యాంక్ కార్యాలయాలు దాడులకు గురయ్యాయి. అవామీ లీగ్ ఇచ్చిన దేశవ్యాప్త లాక్‌డౌన్ పిలుపు నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢాకాలో 24 గంటల వ్యవధిలో 565 మందిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ విద్యాశాఖ మంత్రి నూరుల్ ఇస్లాం నహిద్ కూడా ఉన్నారు. గతేడాది ఇదే సమయంలో ప్రత్యేక ట్రిబ్యునల్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ శిక్ష విధించింది. ఆ తీర్పునకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా అవామీ లీగ్ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది.


బ్రిటన్‌కు రాణి... భారత మూలాల విరిబోణి!



200 ఏళ్ల చరిత్ర తేల్చిన నిజాలు

ఇటీవల భారత పర్యటన సందర్భంగా బ్రిటన్ రాజకుమారుడు విలియమ్, ఆయన సతీమణి కేట్ మిడిల్‌టన్ భారతీయ దుస్తుల్లో మెరిసిపోయారు. అయితే, విలియమ్‌కు భారత్‌తో అనుబంధం అక్కడితో ముగిసిపోలేదని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆయన తల్లి డయానా తరఫు పూర్వీకుల్లో ఒకరైన ఎలైజా బెట్సీ కెవార్క్ అనే మహిళ భారత సంతతి వ్యక్తి అని యూకే పత్రికలు గతంలోనే ప్రచురించాయి. ఇందుకు అవసరమైన జన్యుపరమైన, చారిత్రకమైన ఆధారాలను సుసన్ హార్వర్డ్ అనే మహిళ వెలికి తీశారు. దాదాపు 20 ఏళ్ల పాటు శ్రమించి ఎలైజా చరిత్రను తెలుకున్నారు. ఎలైజా 'బెట్సీ' కెవార్క్ 1790లో జన్మించారు. ఆమె తండ్రి ఆర్మేనియా జాతి వ్యక్తి కాగా తల్లి భారతీయ మహిళ. అప్పటి బాంబే ప్రెసిడెన్సీలో ఆమె జన్మించారు. ప్రిన్స్ విలియమ్‌కు తన తల్లి డయానా తరఫు నుంచి బెట్సీ అమ్మమ్మ అవుతారు. విలియమ్‌కు బెట్సీ ఆరు తరాల ముందు వ్యక్తి. ఎలైజా వారసుల్లో ఇప్పటికీ జీవించి ఉన్న కొందరి మైటోకాండ్రియల్ డీఎన్ఏను పరిశీలించిన పరిశోధకులు ఈ అంశాన్ని ధ్రువీకరించారు. అలా తల్లి ద్వారా విలియమ్‌కు భారత మూలాలు ఉన్నాయని తేల్చారు. అప్పట్లో భారత్‌లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన నడుస్తోంది. కంపెనీకి చెందిన ఓ యువ అధికారి థియోడోర్ ఫోర్బ్స్‌ను ఎలైజా వివాహమాడారు. ఫోర్బ్స్ స్కాట్‌లాండ్‌కు చెందిన వ్యక్తి. ఎలైజాను ఫోర్బ్స్ ఆర్మీనియన్ చర్చిలో పెళ్లి చేసుకున్నారు. కానీ జాత్యాహంకారం రాజ్యమేలుతున్న ఆ కాలంలో ఫోర్బ్స్ కుటుంబానికి ఎలైజా నచ్చలేదు. దీంతో, అధికారిక రికార్డుల్లో ఆమెను ఫోర్బ్స్ ఇంట్లో పనిచేసే వ్యక్తిగానే పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫోర్బ్స్‌కు సంతానం కలిగింది. తమ కూతురు కేథరిన్‌ను (కిట్టీ) ఫోర్బ్స్ స్కాట్‌లాండ్‌కు పంపించారు. తనయుడు అలెగ్జాండర్ మాత్రం తల్లి ఎలైజాతోనే ఉండిపోయాడు. ఆ తరువాత కొంతకాలానికి స్కాట్‌లాండ్‌కు బయలుదేరిన ఫోర్బ్స్ మార్గమధ్యంలోనే కన్నుమూశారు. చివరకు ఎలైజాకు స్వల్ప మొత్తంలో పెన్షన్ మాత్రమే దక్కింది. ఆమె కష్టాల పాలైంది. చివరకు కొంత కాలానికి ఆమె తన భర్త బంధువును ఆర్థిక సాయం కోరుతూ లేఖ కూడా రాశారు. ఆ బంధువు లేఖను ఎలైజా కూతురికి పంపించారు. ఆ తరువాత ఏమైందనేది మాత్రం తెలియలేదు. ఇక స్కాట్‌లాండ్‌లో పెరిగిన కేథరిన్ క్రోంబే కుటుంబానికి చెందిన జేమ్స్ అనే వ్యక్తిని వివాహమాడారు. కాలక్రమంలో క్రోంబే కుటుంబం బ్రిటన్‌లో సామాజికంగా ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకుంది. ఈ కుటుంబానికి చెందిన రూత్ రోష్ కూతురు జానీ ఆత్రోప్‌ను వివాహమాడారు. వారి సంతానమైన డయానా అప్పటి వేల్స్ యువరాజు, నేటి బ్రిటన్ రాజు 3వ చార్ల్స్‌ను పెళ్లాడారు. ఆ తరువాత డయానా ప్రిన్స్ విలియమ్‌కు జన్మనిచ్చారు. దక్షిణాసియా మూలాలున్న ఎలైజా, ఆమె కూతుళ్లు, ఆ తరువాతి తరాల్లోని మహిళల ద్వారా డయానా వరకూ వచ్చిన మైటోక్రాండ్రియన్ డీఎన్ఏనే ఇందుకు విస్పష్టమైన ఆధారమని పరిశోధకురాలు సూసన్ పేర్కొన్నారు. ఈ డీఎన్ఏ మహిళలు మాత్రమే తమ సంతానానికి అందించగలరని అన్నారు. పురుషుల ద్వారా ఇది తరువాతి తరాలకు చేరదని చెప్పారు. ఇక తమ భారతీయ మూలాల గురించి డయానా కుటుంబానికి కూడా తెలుసని కూడా సూసన్ హార్వర్డ్ పేర్కొన్నారు. ఈ విషయం ప్రిన్స్ విలియమ్‌కు కూడా తెలిసే ఉంటుందని చెప్పారు.

సోనాల్‌బెన్‌కు కాంస్యం



పటాయా: థాయ్‌లాండ్‌లోని పటాయా వేదికగా జరుగుతున్న ఐటీటీఎఫ్ ప్రపంచ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో సోనాల్‌బెన్ పటేల్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. మహిళల సింగిల్స్ క్లాస్-3 సెమీఫైనల్లో సోనాల్ బెన్ 9-11, 11-6, 7-11, 5-11 తేడాతో ఇటలీ క్రీడాకారిణి కార్లోటా రగాజిని చేతిలో ఓటమి పాలైంది. దీంతో ఆమె కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సెమీస్‌లో పరాజయం పాలైనప్పటికీ ప్రపంచ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన క్రీడాకారిణిగా సోనాల్‌బెన్ ప్రత్యేక గుర్తింపు పొందింది. మరోవైపు 2020 పారాలింపిక్స్ పతక విజేత భావినా దేవి మాత్రం క్వార్టర్ ఫైనల్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

అర్జున్, ప్రజ్ఞానంద శుభారంభం



బుడాపెస్ట్: హంగేరీ రాజధాని బుడాపెస్ట్ వేదికగా జరుగుతున్న టోటల్ చెస్ ప్రపంచ చాంపియన్‌షిప్ టూర్ పైలట్ టోర్నమెంట్‌లో భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేశి, ఆర్.ప్రజ్ఞానంద విజయాలు సాధించారు. టైటిల్ రేసు నుంచి ఇప్పటికే నిష్క్రమించిన వీరిద్దరూ వర్గీకరణ (క్లాసిఫికేషన్) పోరు తొలి రోజున ఆధిపత్యం చాటారు. 9-12 స్థానాల కోసం జరిగిన వర్గీకరణ పోరులో అర్జున్ ఇరిగేశి 11.5-8.5 పాయింట్ల తేడాతో నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ జోర్డెన్ వాన్ ఫారెస్ట్‌పై ఘన విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో నాలుగు బ్లిట్జ్ గేమ్‌లకు గాను మూడు గేమ్‌లు గెలుచుకున్న అర్జున్ రెండు ర్యాపిడ్ గేమ్‌ల్లోనూ ప్రత్యర్థిని చిత్తు చేశాడు. అనంతరం జరిగిన రెండు ఫాస్ట్ క్లాసికల్ గేమ్‌లను డ్రాగా ముగించి స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందాడు. మరోవైపు 21-24 స్థానాల కోసం జరిగిన పోరులో ప్రజ్ఞానంద 11-9 పాయింట్ల తేడాతో ఉజ్బెకిస్థాన్ స్టార్ నొదిర్బెక్ అబ్దుసతారోవ్‌ను ఓడించాడు. బ్లిట్జ్ విభాగంలో తొలి రెండు గేమ్‌లు ఓడి వెనుకబడినప్పటికీ ప్రజ్ఞానంద అద్భుతంగా పుంజుకున్నాడు. తర్వాతి రెండు బ్లిట్జ్ గేమ్‌లను డ్రా చేసుకున్న అతడు తొలి ర్యాపిడ్ గేమ్‌లో విజయం సాధించి రెండో ర్యాపిడ్ గేమ్‌ను డ్రా చేశాడు. చివరగా ఫాస్ట్ క్లాసికల్ గేమ్‌ను కూడా డ్రాగా ముగించి మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. టోర్నీ సెమీఫైనల్స్ తొలి రోజున నెదర్లాండ్స్ ఆటగాడు అనీష్ గిరి 14.5-5.5తో మాక్సీమ్ లాగ్రేవ్ (ఫ్రాన్స్)పై, ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ అలీరెజా ఫిరౌజా 12-8తో ఫాబియానో కరువానా (అమెరికా)పై విజయాలు సాధించి ముందంజలో నిలిచారు.

టెన్నిస్ ఛాంపియన్‌షిప్ విజేతగా లారా దత్తా కుమార్తె



బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ లారా దత్తా, భారత టెన్నిస్ దిగ్గజం మహేశ్ భూపతి కుమార్తె సైరా యూఏఈలో జరిగిన టెన్నిస్ ఛాంపియన్‌షిప్ టోర్నీ విజేతగా నిలిచింది. ఈ విషయాన్ని లారా సోషల్ మీడియా వేదికగా పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. తన కూతురితో కలిసి టోర్నీకి వెళ్లి.. విజేతగా తిరిగి రావడం ఎంతో సంతోషంగా ఉందంటూ లారా మురిసిపోయారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సైరాకు సంబంధించిన ఫొటోలను లారా షేర్ చేసింది. 'నా కంటే ఎత్తుగా ఎదిగిన నా చిన్నారితో కలిసి టోర్నీకి వెళ్లాను. విజేతగా తిరిగి వచ్చాం. ఎంతో గర్వంగా ఉంది' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఫుజైరాలోని టెన్నిస్ అండ్ కంట్రీ క్లబ్‌లో జరిగిన పోటీలో సైరా విజయం సాధించింది. ఈ సందర్భంగా ట్రోఫీ, ప్రైజ్‌మనీ చెక్కుతో అధికారులతో కలిసి దిగిన ఫొటోలను లారా పంచుకున్నారు.

సైరా సాధించిన ఈ విజయం వెనుక ఆమె కుటుంబానికి టెన్నిస్‌తో ఉన్న అనుబంధం కూడా ప్రత్యేకంగా నిలుస్తోంది. సైరా తండ్రి మహేశ్ భూపతి భారత టెన్నిస్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆటగాళ్లలో ఒకరు. ఆయన కెరీర్‌లో పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో కలిపి 12 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు. 1997లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను జపాన్‌కు చెందిన రికా హిరాకితో కలిసి గెలుచుకుని గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. అనంతరం లియాండర్ పేస్‌తో కలిసి డబుల్స్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందుకున్నాడు. వీరిద్దరి జోడీ ప్రపంచ టెన్నిస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇదిలా ఉంటే.... లారా దత్తా ఇటీవలే వచ్చిన 'రామాయణ' సినిమాలో కైకేయి పాత్రలో నటించారు.

టెస్టు వికెట్ల వేటలో బుమ్రా సరికొత్త చరిత్ర

శ్రీనాథ్ రికార్డు బద్దలు... టాప్-10లోకి దూసుకెళ్లిన పేసర్



వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ వేదికగా గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో బుమ్రా అద్భుత ప్రదర్శన చేశాడు. తొలి రోజు ఆటలో 10 ఓవర్లు వేసిన బుమ్రా 21 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. టామ్ లాథమ్, డారిల్ మిచెల్, టామ్ బ్లండెల్‌లను పెవిలియన్ చేర్చడం ద్వారా కివీస్‌ను ఆరంభంలోనే దెబ్బతీశాడు. ఈ మూడు వికెట్లతో బుమ్రా తన 53వ టెస్టు మ్యాచ్‌లో మొత్తం 237 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ఫలితంగా 67 టెస్టుల్లో 236 వికెట్లు తీసిన మాజీ ఫాస్ట్ బౌలర్ జవగళ్ శ్రీనాథ్‌ను అధిగమించి భారత తరపున అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పదో స్థానానికి చేరుకున్నాడు. శ్రీనాథ్ కంటే 14 టెస్టులు తక్కువగా ఆడి ఈ ఘనత సాధించడం బుమ్రా నిలకడకు, బౌలింగ్ పదునుకు నిదర్శనంగా నిలిచింది. భారత్ తరపున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే (619) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... రవిచంద్రన్ అశ్విన్ (537), కపిల్‌దేవ్ (434), హర్భజన్ సింగ్ (417), రవీంద్ర జడేజా (356) వరుస స్థానాల్లో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో జహీర్ ఖాన్ (311), ఇషాంత్ శర్మ (311), బిషన్ సింగ్ బేడీ (266), బీఎస్ చంద్రశేఖర్ (242) నిలిచారు. బుమ్రా మరో 6 వికెట్లు సాధిస్తే చంద్రశేఖర్‌ను దాటి తొమ్మిదో స్థానానికి ఎగబాకే అవకాశం ఉంది.

'టైమ్ 100 నెక్స్ట్-భారత్' జాబితాలో వైభవ్

ఆయుష్మాన్ ఖురానా ప్రశంసలు



భారత భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న వివిధ రంగాల ప్రతిభావంతులతో రూపొందించిన తొలి 'టైమ్ 100 నెక్స్ట్-భారత్' జాబితాలో వైభవ్ సూర్యవంశీకి స్థానం దక్కింది. ఈ జాబితాలో పలువురు క్రీడా ప్రముఖులు కూడా నిలిచారు. హర్మన్‌ప్రీత్ కౌర్, లవ్లీనా బొర్గోహైన్, మీరాబాయి చాను, ప్రపంచ చెస్ చాంపియన్ డి.గుకేష్, సానియా మీర్జా తదితర ప్రముఖులు ఈ జాబితాలో చోటు సంపాదించారు. చిన్న వయసులోనే ఐపీఎల్‌లో అడుగుపెట్టి ఆపై ఏడాది తిరగకముందే భారత జట్టు తరపున బరిలోకి దిగి రికార్డులు సృష్టించిన వైభవ్‌పై ఆయుష్మాన్ ఖురానా ప్రత్యేక వ్యాఖ్యలు చేశాడు. 'మైదానంలోకి దిగి బ్యాటింగ్‌లో చెలరేగుతుంటే భిన్నంగా ఆలోచించే వారికే అద్భుతమైన భవిష్యత్తు సొంతమని వైభవ్ గుర్తు చేస్తాడు. అతడు క్రీడా రంగంలో అద్భుత ప్రతిభావంతుడే అయినా, నా దృష్టిలో అంతకు మించిన కీలక వ్యక్తి. మారుతున్న భారత్‌కు అతడు ప్రతిరూపం.' అని ఆయుష్మాన్ పేర్కొన్నాడు. 'కేవలం 14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించి, ఆ తర్వాత ఏడాదిలోనే టీమిండియా తరపున ఆడి అరుదైన రికార్డులు సాధించాడు. అతడి ప్రస్థానం చూస్తుంటే ప్రతిభ ఎక్కడి నుంచైనా వస్తుందనేందుకు నిదర్శనంగా నిలుస్తుంది. వైభవ్ విజయాన్ని కొలిచే అసలైన కొలమానం అతడు చేసే పరుగులకు అతీతమైనది. కోట్లాది కలలకు స్వేచ్ఛ ఇస్తే ఏం జరుగుతుందో కాలమే చెప్పింది." అంటూ ఆయుష్మాన్ ఖురానా తన పోస్ట్‌లో వివరించాడు.

హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుత పోరాటం

ఫస్ట్ టెస్టులో కివీస్ స్కోరు 243/5



న్యూజిలాండ్-భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో న్యూజిలాండ్ అద్భుత పోరాట పటిమ కనబరిచింది. ఆదిలోనే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కానీ హెన్రీ నికోల్స్(ఎవఅతీఎ చీఱఎష్ట్రశీశ్రీశ్రీం), గ్లెన్ ఫిలిప్స్ జట్టును ముందుండి నడిపించారు. ఈ క్రమంలో నికోల్స్ సెంచరీ చేయగా.. ఫిలిప్స్ సెంచరీకి చేరువయ్యాడు. తొలి రోజు ఆట ముగిసేసరికి నికోల్స్ 221 బంతులు ఎదుర్కొని 14 ఫోర్ల సాయంతో 113 పరుగులు.. ఫిలిప్స్ 182 బంతుల్లో 13 ఫోర్లు బాది 94 పరుగులతో అజేయంగా నిలిచారు. ఇద్దరూ కలిసి ఆరో వికెట్‌కు అబేధ్యంగా 173 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో కివీస్ తిరిగి పుంజుకుంది. ఫలితంగా తొలి రోజు ఆట ముగిసేసరికి న్యూజిలాండ్ ఐదు వికెట్ల నష్టానికి 243/5 పరుగులు చేయగలిగింది.

అంతకు ముందు టాస్ గెలిచిన టీమిండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో ఆది నుంచే భారత పేసర్లు చెలరేగారు. ఓపెనర్లలో కెప్టెన్ టామ్ లాథమ్‌ను జస్‌ప్రీత్ బుమ్రా డకౌట్ చేయగా.. డెవాన్ కాన్వేను నాలుగు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అన్షుల్ కాంబోజ్ పెవిలియన్‌కు పంపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రచిన్ రవీంద్ర (15) వికెట్‌ను ఆకాశ్ దీప్ తన ఖాతాలో వేసుకోగా.. డారిల్ మిచెల్ (1) రూపంలో మరో కీలక వికెట్‌ను బుమ్రా దక్కించుకున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్ టామ్ బ్లండెల్ (5) కూడా వెనక్కి పంపాడు. ఫలితంగా ఉదయం సెషన్‌లో న్యూజిలాండ్ కేవలం 70 పరుగులు చేసి ఏకంగా ఐదు వికెట్లు కోల్పోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వన్‌డౌన్ బ్యాటర్ హెన్రీ నికోల్స్, ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్ కలిసి అద్భుత రీతిలో పోరాడారు. భారత బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా 3.. అన్షుల్ కాంబోజ్, ఆకాశ్ దీప్ చెరో వికెట్ తీశారు.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 20 నవంబరు 2026
X

మెన్స్ డే స్పెషల్
RAPO23 ప్రీ-లుక్ వైరల్!



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లోనే ఒక పెద్ద సాహసానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు హీరోగా అలరించిన ఆయన ఇప్పుడు తొలిసారిగా కథ రాసి, దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న RAPO23 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా, నియో-నోయిర్ శైలిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఆరంభం నుంచే మంచి ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మెన్స్ డే) సందర్భంగా రామ్ పోతినేని ఈ సినిమా నుంచి ఒక ఆసక్తికరమైన ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. "ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్" అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ పోస్టర్‌లో రామ్ తనదైన శైలిలో కొత్త లుక్‌తో కనిపిస్తూ అభిమానుల్లో జోష్ నింపారు. తన దారిని తానే ఎంచుకుంటూ, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే స్వతంత్ర వ్యక్తిగా ఈ పాత్రను ఆయన పరిచయం చేశారు. ఈ పోస్టర్ ద్వారా అందరికీ మెన్స్ డే విషెస్ చెప్పిన చిత్ర బృందం, త్వరలోనే సినిమా ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథా నాయికగా నటిస్తుండగా బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తుండగా, ఎస్.తిరునావుక్కరసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూస్తున్నారు. దర్శకుడిగా, నటుడిగా రామ్ పోతినేని ఈ సినిమాతో ఎలాంటి కొత్త అనుభూతిని పంచుతారో చూడాలి.




మాస్ యాక్షన్ విందుతో
బెల్లంకొండ 'టైసన్ నాయుడు'

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో దర్శకుడు సాగర్ కె.చంద్ర తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. సాయి శ్రీనివాస్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపించనున్నారు.

నేహా శెట్టి, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో నరేష్, రావు రమేష్, సునీల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'మదరాసి రబ్బరు బొమ్మ' పాటకు మంచి స్పందన లభించగా తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలోనే చిత్ర విడుదల తేదీపై మేకర్స్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

'100 గ్రేటెస్ట్ మూవీ స్టార్స్' జాబితాలో షారుఖ్ ఖాన్
టాప్-3లో నిలిచిన దిగ్గజాలు వీరే!

ప్రముఖ అంతర్జాతీయ ఎంటర్‌టైన్‌మెంట్ మ్యాగజీన్ 'వెరైటీ' విడుదల చేసిన 'ది 100 గ్రేటెస్ట్ మూవీ స్టార్స్ ఆఫ్ ఆల్‌టైమ్'ప్రతిష్ఠాత్మక జాబితాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ చోటు సంపాదించుకున్నారు. ఈ జాబితాలో ఆయన 92వ స్థానాన్ని సొంతం చేసుకున్నట్టు వెరైటీ తెలిపింది. ఇక షారుఖ్ ఈ జాబితాలో నిలిచిన ఏకైక భారతీయ నటుడు కావడం విశేషం. ప్రపంచ సినిమా చరిత్రలో అత్యంత ప్రభావశీలమైన, గొప్ప తారల సరసన ఆయన నిలవడం భారత సినీ అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మూడు దశాబ్దాలకు పైగా సినీ ప్రస్థానంలో ఎన్నో చిరస్మరణీయ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన షారుఖ్ ఖాన్ అంతర్జాతీయ స్థాయిలోనూ తనదైన స్టార్‌డమ్ కొనసాగిస్తున్నారు. హాలీవుడ్ దిగ్గజ తారలతో పాటు ఈ జాబితాలో ఆయన పేరు కనిపించడం విశేషం. రొమాంటిక్ డ్రామాలు, యాక్షన్ థ్రిల్లర్లు, భావోద్వేగ చిత్రాల ద్వారా కోట్లాది మంది అభిమానుల మనసులను గెలుచుకున్న షారుఖ్ కేవలం నటనతోనే కాకుండా తన మాట తీరు, వ్యక్తిత్వంతోనూ గ్లోబల్ ఐకాన్‌గా ఎదిగారు.



ఇక ఈ జాబితాలో 1950ల నాటి గ్లామరస్ తార మార్లిన్ మన్రోకు తొలి స్థానం దక్కింది.రెండో స్థానంలో అలనాటి ప్రముఖ నటుడు హంఫ్రీ బొగర్ట్, మూడో స్థానంలో సుప్రసిద్ధ హాస్య నటుడు చార్లీ చాప్లిన్ నిలిచారు.ఈ అరుదైన ఘనతపై షారుఖ్ ఖాన్ అభిమానులు సోషల్ మీడియాలో హర్షం వ్యక్తంచేస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'కింగ్ ఆఫ్ బాలీవుడ్'కు ఇది మరో గర్వకారణమైన క్షణమని పోస్టులు పెడుతున్నారు. ప్రపంచ సినిమా దిగ్గజాల జాబితాలో 92వ స్థానంతో షారుఖ్ ఖాన్‌కు చోటు దక్కడం భారత సినిమా కీర్తిని మరోసారి అంతర్జాతీయ వేదికపై నిలబెట్టింది.

జీరో కట్స్‌తో సెన్సార్ పూర్తి
సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'.. విడుదల ఎప్పుడంటే!

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'మాతృభూమి' ('మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్') చిత్రం సెన్సార్ ప్రక్రియ పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి యు/ఏ 16+ సర్టిఫికెట్ జారీ చేసింది. ఎలాంటి కట్స్ సూచించకుండానే సినిమాకు క్లియరెన్స్ లభించడం విశేషం. ఈ చిత్రం మొత్తం నిడివి 2 గంటల 34 నిమిషాల 12 సెకన్లుగా ఖరారైంది. తొలుత ఈ నెల 20న విడుదల చేయాలనుకున్నప్పటికీ కొన్ని కారణాలతో వాయిదాపడింది. తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. 2020 గల్వాన్ లోయ



ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. దేశ రక్షణ కోసం పోరాడే సైనికాధికారి కల్నల్ సంతోష్ బాబు పాత్రలో సల్మాన్ ఖాన్ నటించగా కుటుంబ బాధ్యతలను నిలబెట్టే భార్య పాత్రలో చిత్రాంగదా సింగ్ కనిపించనున్నారు. వీరిద్దరి త్యాగం, భావోద్వేగాల చుట్టూ కథ సాగుతుంది. మొదట ఈ సినిమాను 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరుతో ప్రకటించగా మార్చి 2026లో 'మాతృభూమి'గా మార్చారు. ప్రభుత్వ ఒత్తిడితో స్క్రిప్ట్‌లో మార్పులు చేశారన్న వార్తలను సల్మాన్ ఖాన్ ఖండించారు. ఇటీవల ప్రమోషన్లలో భాగంగా సల్మాన్ ఖాన్ చిత్ర బృందానికి లక్షల రూపాయల విలువైన లగ్జరీ వాచీలను బహుమతిగా ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు.

అనిరుధ్ అభిమానుల్లో
టాప్ ప్లేస్ నాదే: అల్లు అర్జున్

భారత భవిష్యత్తును వివిధ రంగాల్లో తీర్చిదిద్దుతున్న 100 మంది ప్రతిభావంతులతో రూపొందించిన 'టైమ్ 100 నెక్ట్స్ ఇండియా-2026' జాబితాలో అనిరుధ్ నిలిచారు. దీనిపై అల్లు అర్జున్ స్పందిస్తూ అనిరుధ్‌ను 'మ్యూజికల్ జీనియస్'గా అభివర్ణించారు. "అనిరుధ్ కెరీర్ తొలినాళ్ల నుంచి నేను ఆయన పనితీరును గమనిస్తున్నాను. గత దశాబ్ద కాలంగా తన అద్భుత సంగీత ప్రతిభతో తమిళ చిత్ర పరిశ్రమను ఒంటి చేత్తో మరో స్థాయికి తీసుకెళ్లారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు" అని అల్లు అర్జున్ పేర్కొన్నారు. "అనిరుధ్ సంగీతం భాషలు, సంస్కృతులు, సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తోంది. అనిరుధ్ అంటేనే ఉరకలెత్తే ఉత్సాహం. 'విక్రమ్' నుంచి 'జైలర్ 2' వరకు పలు భాషల్లో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ చిత్రాలను తన నేపథ్య సంగీతంతో మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఈ తరానికి చెందిన నిజమైన ఇండియన్ పాప్‌స్టార్. అనిరుధ్ అభిమానుల జాబితాలో నేనే అగ్రస్థానంలో ఉంటాను" అంటూ అల్లు అర్జున్ తన అభినందన సందేశంలో వివరించారు.





కుమార్తె వ్యక్తిగత జీవితంపై అసత్య ప్రచారం.. అర్జున్ ఆగ్రహం

తన పెద్ద కుమార్తె, నటి ఐశ్వర్య అర్జున్ వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారంపై ప్రముఖ నటుడు అర్జున్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నవారిపై ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. ఇటీవల తన చిన్న కుమార్తె అంజన వివాహం జరిగిన నేపథ్యంలో, ఐశ్వర్య వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు, అసత్యవార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఆమె వైవాహిక జీవితంలో సమస్యలు ఉన్నాయంటూ వదంతులు వ్యాపించాయి. ఈ పరిణామాలపై స్పందించిన అర్జున్.. "ఒక తండ్రిగా నా కుమార్తెను లక్ష్యంగా చేసుకుని ఆధారాలు లేని, అవమానకరమైన ఆరోపణలు చేస్తుంటే చూస్తూ మౌనంగా ఉండలేను. నటులుగా మేము ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ఊహాగానాలు, విమర్శలు సహజమని అర్థం చేసుకుంటాం. సెలబ్రిటీలం అయినంత మాత్రాన మాగురించి ఏదైనా మాట్లాడే హక్కు ఎవరికీ ఉండదు. ఈఅసత్య ప్రచారంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేశాం" అని స్పష్టం చేశారు. పత్రికా రంగాన్ని తానుఎంతో గౌరవిస్తానని పేర్కొన్న అర్జున్..నిజానిజాలు,విశ్వసనీయత గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రచారం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక తండ్రిగా తన కుమార్తెకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.